తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాద్రాద్రి భువనగిరి

మంగళవారం

06 జనవరి 2026

పేజీలు : 8

Follow :




### జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను జిల్లాలో నిర్వహించడం

# జిల్లాకు గర్వకారణం

**కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలనలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**



పినపాక, జనవరి 05(జనం సాక్షి): పినపాక మండలం ఏడుళ్ళ బయ్యారం గ్రామంలో ఈ నెల 7వ తేదీ నుండి ప్రారంభం కానున్న జాతీయ స్థాయి అండర్?17 బాలుర కబడ్డీ పోటీలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పినపాక జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ ఆవరణలో కబడ్డీ పోటీల నిర్వహణ కోసం చేపడుతున్న ప్రాంగణ అభివృద్ధి పనులు, కబడ్డీ కోర్టుల నిర్మాణం, ప్రేక్షకుల గ్యాలరీలు, క్రీడాకారుల వసతి సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, వైద్య సేవలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో కబడ్డీ వంటి ప్రముఖ క్రీడా పోటీలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా దేశవ్యాప్తంగా జిల్లాకు మంచి గుర్తింపు తీసుకొచ్చే కార్యక్రమం కావడంతో ఎక్కడా చిన్న లోపం కూడా తలెత్తకుండా అత్యుత్తమ ప్రమాణాలతో పోటీలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక నిపుణులు, రిఫరీలు, అధికారులు, మీడియా ప్రతినిధులు మరియు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. క్రీడాకారుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో పరిశుభ్రత, నాణ్యమైన భోజన ఏర్పాట్లు, స్వచ్ఛమైన తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలని తెలిపారు. క్రీడాకారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా 24 గంటల వైద్య సేవలు, అంబులెన్స్, ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పోటీ ప్రాంగణం, వసతి ప్రాంతాలు, ప్రధాన రహదారులపై తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. అలాగే అగ్నిమాపక శాఖ సహకారంతో ఫైర్ సేఫ్టీ చర్యలు పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పోటీ ప్రాంగణం పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,“ఈ నెల 7వ తేదీ నుండి పినపాక మండలం ఏడుళ్ళ బయ్యారం గ్రామంలో జాతీయ స్థాయి అండర్?17 బాలుర కబడ్డీ పోటీలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ పోటీలు జిల్లాలో జరగడం జిల్లా వాసులందరికీ గర్వకారణం. రాష్ట్రంలో కబడ్డీపై ఆసక్తి, అభిమానం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పోటీలకు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించాలి. దేశంలోని పలు రాష్ట్రాల నుండి వచ్చే క్రీడాకారులు, అధికారులు భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకునే అవకాశం కూడా కలుగుతుంది. అలాగే గోదావరి తీర ప్రాంతాల సహజ సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. పోటీల నిర్వహణకు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన పలు ప్రముఖ సంస్థలు సి.ఎస్.ఆర్. ద్వారా విలువైన సహకారం అందిస్తున్నాయి. వారికి జిల్లా యంత్రాంగం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. క్రీడాకారులందరూ ఉత్సాహంగా పాల్గొని ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి తెలంగాణకు గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పోటీలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి పట్టివేత

### స్కూటీపై గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

**బూర్గంపహాడ్ జనవరి 05 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ పోలీసులకు స్కూటీపై గంజాయి తరలిస్తూ పట్టుబడిన సంఘటన సారపాకలో సోమవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం...సీలేరు వైపు నుంచి జగ్గయ్యపేట వైపు భద్రాచలం మీదుగా స్కూటీపై జగ్గయ్యపేట మండలానికి చెందిన కన్నెగంటి ఈశ్వర్ గోపీనాథ్, గూటి నాగరాజు గంజాయి తరలిస్తుండగా సారపాకకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో వెనుక కూర్చున్న నాగరాజు పరారవ్వగా ఈశ్వర్ గోపీనాథ్ కు ప్రమాదంలో గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో అక్కడకు చేరుకుని వాహనం తనిఖీ చేయగా 15 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి గోపీనాథ్ ను అదుపులోకి తీసుకుని విచారించగా జగ్గయ్యపేట మండలమని, సీలేరు నుంచి జగ్గయ్యపేట వైపు గంజాయి తరలిస్తున్నామని చెప్పడంతో అతన్ని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.7.65 లక్షలు ఉంటుందని తెలిపారు.

# మర్రిగూడ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ

**వీధి కుక్కల పట్టివేత... లైట్లు, మంచినీరు, వీధుల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

**మర్రిగూడ గ్రామ అభివృద్ధి పై తమదైన మార్క్ చూపిస్తున్న మర్రిగూడ సర్పంచ్ వీరమళ్ళ శిరీష లోకేష్ గౌడ్**



**మర్రిగూడ, జనవరి5 (జనంసాక్షి):** మర్రిగూడ గ్రామపంచాయతీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ మర్రిగూడ ప్రజల చేత ప్రశంసలు అందుకుంటున్న మర్రిగూడ సర్పంచ్ వీరమళ్ళ శిరీష లోకేష్ గౌడ్, మర్రిగూడ గ్రామ అభివృద్ధిలో తమదైన మార్కుతో ముందుకు వెళుతూ గ్రామంలోని అన్ని సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధిస్తూ వీధి దీపాలు, మంచినీటి సౌకర్యం, వీధుల పరిశుభ్రత, మురికి కాలువల పరిశుభ్రత, వీధి కుక్కల బెడద పై ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నారు. మర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వీధి కుక్కలను పట్టి వేసి దూర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ వీరమల్ల శిరీష బిలోకేష్ గౌడు తెలిపారు. సోమవారం గ్రామంలో ఉన్న వీధి కుక్కల బెడద నుండి కాపాడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇక్కడి నుండి తరలించడానికి హైదరాబాదు నుంచి వచ్చిన ప్రత్యేక వారి చేత వ్యాన్లలో తరలించారు. మండల కేంద్రం కావడంతో నిత్యం రద్దీగా ఉండే మర్రిగూడలో ప్రజలు,ప్రయాణికులు, గొర్రెలను, మేకలను కోళ్లను ఈ వీధి కుక్కలు ఇబ్బందులు కలుగజేస్తున్నందువల్ల ప్రజల ఫిర్యాదు మేరకు చేసిన వీధి కుక్కల తరలింపు కార్యక్రమానికి సర్పంచును గ్రామస్తులు కొనియాడారు. జనావాసాల రహిత ప్రాంతాలకు ఈ కుక్క లను తరలిస్తున్నట్లు సర్పంచి తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని మరి కూడా సర్పంచ్ శిరీష వీరమల్ల లోకేష్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యూసఫ్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





# క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం, జనవరి 05 (జనంసాక్షి)**

నూతన సంవత్సర సందర్భంగా 46 డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ఆధ్వర్యంలో 2025లో డివిజన్లో చేపట్టిన అభివృద్ధి పనుల చిత్రాలతో నియోజకవర్గస్థాయిలో మంత్రి తుమ్మల గారు చేపట్టిన అభివృద్ధి పనుల చిత్రాలతో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ 2026 ను హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్ లో గౌరవ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ని అభినందించారు. అనంతరం డివిజన్ పరిధిలో సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి సంబంధించిన వినతిపత్రం మంత్రి కి అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల పనులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ముున్ముందు కాలంలో డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రజ్జి నాయకులు ఎమ్మే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు .



# వందేళ్ల సిపిఐ పార్టీ బహిరంగ సభను జయప్రదం చేయాలి

**❍అధికారం ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన సిపిఐ పార్టీ ❍ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి**

**కొండమల్లేపల్లి, జనవరి 5 (జనంసాక్షి):** జనవరి 18వ తేదీన ఖమ్మంలో సిపిఐ పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం జరిగిన సిపిఐ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సిపిఐ పార్టీ 1925 లో కాన్పూర్ లో స్థాపించారని స్వాతంత్ర ఉద్యమంలో సిపిఐ పార్టీ కీలక పాత్ర పోషించిందని అన్నారు. సిపిఐ పార్టీ దేశ స్వాతంత్రం కోసం ఎన్నో పోరాటాలు చేశారని ఎందరో దేశభక్తులు ఎర్రజెండాను ఎత్తుకొని దేశం కోసం అమరులయ్యారని ఆయన అన్నారు. బ్యాంకుల జాతీయకరణ ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు భూ సంస్కరణలు వంటి నిర్ణయాలను భారతదేశంలో అమలు చేయడానికి కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా కృషి చేసిందని ఆయన అన్నారు. దేశంలో 100 సంవత్సరాలుగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలని నష్టాల పేరుతో మూసివేస్తుందని విమర్శించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే విధంగా ప్రయత్నాలు చేస్తూ కేంద్రం 60 శాతం రాష్ట్రాలు 40 శాతం నిదులు ఖర్చు చేయాలని కొత్తగా ఆదేశాలు జారీ చేయడం వలన పథకము నీరుగారి పోతుందని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరుని తొలగించి జీరాంజీ పేరు ప్రవేశ పెట్టడం దురదృష్టకరమని అన్నారు. బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్కౌంటర్లు చేసి మావోయిస్టులను చంపేసిందని అన్నారు. నక్సలైట్లకు మద్దతు ఇస్తున్నారనే నెపంతో కమ్యూనిస్టు పార్టీ నాయకులను అర్బన్ నక్సలైటు ముద్ర వేసి అరెస్టు చేస్తుందని ఆరోపించారు. అటవి సంపదను కార్పొరేట్ భక్తులకు అప్పగించడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. అనేక పార్టీలు ఈ వందేళ్ళ కాలంలో కనుమరుగైపోయాయని కమ్యూనిస్టు పార్టీ మాత్రం అధికారం లేనప్పటికీ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ తన స్థానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటుందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దాన అమలు చేయడంలో చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 18వ తేదీన ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు మండలం నుంచి పార్టీ సభ్యులు సానుభూతి పరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సిపిఐ మండల సహాయ కార్యదర్శి శేఖరాచారి అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర రెడ్డి మండల కౌన్సిల్ సభ్యులు శ్రీను, సొమ్లా నాయక్, చరణ్ రెడ్డి, వీరస్వామి, సత్యనారాయణ, మల్లాచారి, మార్క్ సొమ్లా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.







## నాగార్జున స్కూల్లో ఘనంగా మహిళ ఉపాధ్యాయ దినోత్సవం

**రామన్నపేట, జనవరి 5 (జనంసాక్షి):** రామన్నపేట పట్టణ కేంద్రంలోని నాగార్జున స్కూల్ లో సావిత్రిబాయి పూలే జన్మదినం సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నత అధికారులుగా, ఉపాధ్యాయులుగా వివిధ సబ్జెక్టులు బోధించి ప్రత్యేకతను చాటుకున్నారు. ఈ సందర్భంగా నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడుతూ భారతదేశపు తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా, సామాజిక సంస్కర్త, స్త్రీల హక్కుల పోరాట యోధురాలు, ఆమె తన భర్త జ్యోతిరావు పూలే తో కలిసి బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సావిత్రి బాయి పూలే జన్మ దినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. కరెస్పాండెంట్ డాక్టర్ నాగరాజు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్రమ్, సంధ్య, స్వప్న, విజయశ్రీ లత, వినిష, మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శివలీలకు స్వర్ణ నంది అవార్డు ప్రధానం..

**కనగల్లు, జనవరి 5 (జనంసాక్షి)** సామాజిక సేవకురాలు ఆర్ఎంపీ డాక్టర్ కంబాల శివలీల సేవలను గుర్తించి విశ్వ జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్ణ నంది అవార్డును చైర్మన్ పో గారం బ్రహ్మానందం చేతుల మీదుగా ఆమెకు విజయవాడ నగరంలో సోమవారం అందజేశారు. నా సేవలను గుర్తించి గౌరవమైన అవార్డుతో సత్కరించినందుకు ఫౌండేషన్ చైర్మన్, సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిదండి భక్తి సుందర్ మంగల్ మహారాజ్ స్వామీజీ, మంగళగిరి మఠం బత్తుల మురళి, శ్రీనివాసరావు, పూర్ణిమ, దండి రాజేష్, కోమలి, బాలాజీ, రాధా నాయుడు, శ్రీమాన్, వేణు, శ్రవణ్, విజయ, సృజన, వెంకట సుబ్బారావు తదితరులు ఉన్నారు.





## క్యాలెండర్ మరియు డైరీలను ఆవిష్కరించిన మండల విద్యాధికారి

**చింతలపాలెం (జనంసాక్షి)** చింతలపాలెం మండల కేంద్రము మండల వనరుల కేంద్రం నందు స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2026వ సంవత్సరం టేబుల్ క్యాలెండర్ మరియు డైరీలను మండల విద్యాధికారి నారపరాజు శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం యొక్క విద్యాభివృద్ధి, విద్యార్థులకు న్యాయమైన విద్య అందించుటలో ఎస్టీయూ ఉపాధ్యాయులు ముందుండి కృషి చేస్తారని తెలిపారు. జిల్లాలో మండలాన్ని విద్యావధములో అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఉస్తేల నారాయణ రెడ్డి, రవి, ఎస్టీయూ రాష్ట్ర మహిళా కో కన్వీనర్ వెంకటరమణ, జిల్లా నాయకులు ఒరుగంటి నాగేశ్వరరావు, మండల బాధ్యులు క్రాంతి కుమార్, అజ్మీర బాలు, మంచికంటి కళావతి, మానస, నాగు, సురేష్, నారాయణ రావు, శ్రీనివాసచారి, నిర్మల కుమారి, ఉస్మాన్ , పెండెం శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ఘనంగా 37 వ జాతీయ భద్రత వారోత్సవాలు

**మేళ్లచెరువు (జనం సాక్షి)** స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేళ్లచెరువు నందు 37వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు లను ప్రారంభించారు మరియు జాతీయ రోడ్డు భద్రత జెండా ను యూనిట్ హెడ్ యన్ శ్రీనివాసరావు ఎగురవేశారు. భద్రత విభాగం వారు అందరిచేత రోడ్డు భద్రత వారోత్సవాలు పురస్కరించుకుని రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రత పాంప్లెట్స్ హెడ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థలో పనిచేస్తున్నటువంటి సిబ్బంది కార్మికులు మరియు డ్రైవర్స్ అందరూ పాల్గొన్నారు. అదేవిధంగా జాతీయ రోడ్డు భద్రత రోడ్డు వారోత్సవాలు పురస్కరించుకుని యూనిట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవ్ చేసేటప్పుడు సీటు బెల్టు క్రాస్ హెల్మెట్ ,ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఉండవలెను దీనివలన ప్రమాదాలను వివరించవచ్చని ఆయన చెప్పారు.

## చెస్ క్రీడలో రాణిస్తున్న కోదాడ విద్యార్థిని

**కోదాడ, జనవరి 5 (జనంసాక్షి):** కోదాడకు చెందిన భూక్య అద్వైత చెస్‌క్రీడా రాణిస్తున్నది. ఆదివారం ఖమ్మం హరితగార్డెన్ లో వీరాజ్ సెకండ్ స్టేట్ లెవల్ అండర్ 12 చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 276 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కోదాడ తేజ విద్యాలయలో 5వ తరగతి చదువుతున్న భూక్య అద్వైత అండర్ 10 విభాగంలో ప్రథమ బహుమతి సాధించింది. పాఠశాలలో చదరంగం ఆటను 3వ తరగతి నుంచి ఒక ప్రాధాన్యంశంగా చేయడం వలన విద్యార్థులలో చురుకుదనం , వేగ వంతమైన ఆలోచనా విధానం, జ్ఞాపకశక్తి మెరుగుపడటం గమనించామని ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. 276 మంది పాల్గొన్న పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థిని భూక్యా అద్వైతను ప్రిన్సిపాల్ రమాదేవి , చదరంగం శిక్షణా ఉపాధ్యాయుడు కొండా నర్సింహారావు మరియు అధ్యాపకులు అభినందించారు.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ కె.సీతారామారావు

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** ప్రజావాణి ఫిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న పిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ద పెట్టి పరిష్కరించాలని అన్నారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు సంబంధించి 26 దరఖాస్తులు, జిల్లా పంచాయతీ అధికారి 8, డిడబ్ల్యుఓ 5, డిఆర్డిఏకు 3, మిగిలిన 36 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 78 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాదవ్, ఇంచార్జ్ డిఆర్డిఏ పిడి శిరీష, మహిళా సంక్షేమ అధికారి కె.నర్సింహారావు, హౌజింగ్ పిడి సిద్ధార్థ, జిల్లా



వెటర్నరీ అధికారి శ్రీనివాస్, సిపిఓ కిషన్ నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కొత్తపల్లి కృష్ణారావుకు సత్కారం

**ఖమ్మం టౌన్ (జనంసాక్షి)**

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలలో ఖమ్మం పట్టణానికి చెందిన కవి రచయిత మిమిక్రీ కళాకారుడు అయిన కొత్తపల్లి కృష్ణారావు" నా గమనం మానవతా దృక్పథం కోసం" అన్న కవితకు సత్కారం అందుకోవడం జరిగింది. కవి సమ్మేళనం జాతీయ కవి ఎస్ఆర్ఎస్ కొల్లూరి, కలిమిశ్రీ నిర్వహించారు. కవి సమ్మేళనం సంధానకర్తగా కొత్తగూడెం రాజేశ్ వ్యవహరించారు.

## అక్షరదీపం ఫౌండేషన్" ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష సామాగ్రి పంపిణీ

**నేరేడుచర్ల (జనంసాక్షి):**



"అక్షరదీపం ఫౌండేషన్ "నేరేడుచర్ల ఆధ్వర్యంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల పదవతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష సామాగ్రి (ఎగ్జామినేషన్ కిట్) ఒక్కొక్కరికి రూ 500/లు వెచ్చించి మొత్తం 52 మంది విద్యార్థినీ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధనలో విద్యార్థిని విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగపరచు కోవాలని చదువులకు పేదరికం అడ్డుకాకూడదని విద్యార్థులను ప్రోత్స హిస్తూ ఎన్నో విధాలుగా చేయూతనందిస్తున్న సత్సంకల్పాన్ని అభినందిం చారు. ఈ కార్యక్రమంలో అక్షరదీపం ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యా యులు ఎం సైదులు, రషీద్ ఖాన్, జానకిరాములు, శౌరి, వెంకటేశ్వరరావు, వెంకట్ రెడ్డి, అన్నపూర్ణ, ఎం మాధవి ,నాగమణి, అఫ్రూన్, ఎన్వి జానయ్య, బికోజి, భానుమతి, రామ్మూర్తి, బాలు, యాదగిరి, సరస్వతి, వెంకటేశ్వర్లు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# 11న ఖమ్మంలో ఇస్లాం ధార్మిక బహిరంగ సభ

### జనాబ్ ముఫ్తి అలావుద్దీన్ సాహెబ్



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి)**

ఇస్లాం - ధర్మం - బోధనలు - పరివర్తన అనే అంశంపై ప్రతి ముస్లిం సోదర సోదరీమణులు మహమ్మద్ ప్రవక్త మహమ్మద్ స.అ.స. చూపిన మార్గంలో పయనించాలని కోరుతూ.. ఈ నెల 11 న ఖమ్మం నగరంలోని వైరారోడ్ ప్రాంతంలో గల నిజాంపేట్ మస్జిద్ లో గొప్ప ఇస్లాం ధార్మిక బహిరంగ సభను సక్సెస్ చేయాలని జనాబ్ ముఫ్తి అలావుద్దీన్ సాహెబ్ (ఇమామ్ - వ - ఖతీబ్ మస్జిదే, (నిజాంపేట్.) పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంలోని నిజాం పేట్ మస్జిద్ ఆవరణలో ధార్మిక సభకు చెందిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్లానీ - ధర్మనీ - బోధనలు - పరివర్తన సమాజంలోని రుగ్మతలు అనే అంశాలపై ఈనెల 11 వతేది ఆదివారం సా?గం॥6.30 ని?లకు గొప్ప ధార్మిక సభ నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ ధార్మిక సభకు ముఖ్య అతిథిగా జనాబ్ హాజరత్ మౌలానా షేక్ రిజ్వానుద్దీన్ మారూఫి సాహెబ్ (అధ్యాపకులు హదీస్ విభాగం, మదరసా, ఇషాతుల్ ఉలూమ్, అక్కల్ కూవా, మహారాష్ట్ర) సభాధ్యక్షులుగా జనాబ్ హాజరత్ మౌలానా మొహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మి (ఉపాధ్యక్షులు, జె.యు.హెచ్. తెలంగాణ, జిల్లా అధ్యక్షులు, ఖమ్మం.), నిజాం పేట్ మస్జిద్ నిర్వహణ కమిటి ముస్లిం యువత, ఖమ్మం. పర్యవేక్షణలో జరిగే సభకు ఖమ్మం సోదర, సోదరీమణులు, అత్యధిక సంఖ్యలో హాజరై ఈ ఆధ్యాత్మిక సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈసభకు విచ్చేసిన స్త్రీలకు ప్రత్యేక వరదా సౌకర్యము కలదని పేర్కొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తవ్వాఫ్ టూర్ అండ్ ట్రావెల్స్ హజ్ ఉమ్రా సర్వీసెస్ సంస్థ అధినేత, మస్జిద్ ఏ జైన్ హాఫీజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్, మహమ్మద్ సాజిద్, అహ్మద్ ఖాజా, సయ్యద్ గౌస్ పాషా, మహమ్మద్ జహ్వార్, మహమ్మద్ అఫ్జల్ అలీ, ఎంఎ సమద్, అహ్మద్ పాషా, చాంద్ పాషా, హాఫీస్ అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## విమర్శలు మాని చర్చకు రండి : మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి



**బూర్గంపహాడ్ జనవరి 0 5 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం అభివృద్ధిని చూసి ఈర్ష్యా ద్వేషాలతో రగిలిపోతున్న మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీని, స్థానిక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ని విమర్శిస్తున్నారని, విమర్శలు మాని చర్చికి రావాలని బూర్గంపహాడ్ పిఎసిఎస్ మాజీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పినపాక నియోజవర్గంలో పాయం వెంకటేశ్వర్లు ద్వారానే అభివృద్ధి జరిగిందనేది జగమెరిగిన సత్యం అని, అదేవిధంగా భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సాధించడంలో శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కృషి పినపాక నియోజకవర్గ ప్రజలు మర్చిపోలేరని అన్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు నుండి కాలువల ద్వారా రైతుల పొలాలకు నీరు అందించిన ఘనత ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అని అన్నారు. ప్రతి పేదవాడికి సన్నబియ్యం అందించడం, మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అభివృద్ధి పథకాలతో ప్రజల మనసును గెలుచుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో అత్యధిక సర్పంచ్ స్థానాలను ప్రజలు అందించారని ఇది చూసి ఓర్వలేకనే మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు విమర్శలు చేస్తున్నారన్నారు. విద్యావంతుడు రెండు పర్యాయాలు శాసనసభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉండి ఇటువంటి చౌకబారు విమర్శలు చేయడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు, సారపాక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, బూర్గంపహాడ్ ఉపసర్పంచ్ గుండె వెంకన్న, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ , బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కన్నేపల్లి శివ, నాయకులు భజన ప్రసాద్, దగ్గుపల్లి ప్రభాకర్, తిరుమల రాంబాబు, దేగల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు

**భద్రాచలం జనవరి 05 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు జనవరి 1 నుంచి 31 వరకు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, భద్రతా నియమాలపై అవగాహన కల్పించడానికి పోలీసు మరియు రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు అనేవి ట్రాఫిక్ నియమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం మరియు రోడ్డు ప్రమాదాల కారణంగా జరిగే మరణాలను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్న జాతీయ కార్యక్రమమని అన్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారని, చాలా మంది రోడ్డు ప్రమాదాలలో గాయపడుతున్నారని, ప్రధానంగా ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన లేకపోవడం లేదా వాటిని ఉల్లంఘించే ప్రవర్తన కారణమని అన్నారు. ప్రజలకు (వాహనదారులు అలాగే పాదచారులు మరియు సైక్లిస్టులు) ట్రాఫిక్ నియమాల గురించి మరింత అవగాహన కల్పించడానికి, రోడ్డుపై ఉన్నప్పుడు నియమాలను పాటించమని వాటిని అనుసరించమని కోరటానికి, ప్రతి సంవత్సరం రోడ్డు భద్రతా వారోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవం కోసం భద్రాచలం పోలీసులు అవగాహన ప్రచారం, కార్యకలాపాలు, ప్రాసిక్యూషన్ డ్రైవ్‌లను రూపొందించడం జరిగినది. దీనిలో భాగం గా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడుతుందని, నిభందనలు అతిక్రమించిన వారి పై చట్టరీత్య తగు చర్య తీసుకోనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు హెల్మెట్‌లు, సీటు బెల్టులు ధరించడం తప్పనిసరి. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం నేరమని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, అందుకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నంబర్ ప్లేట్ స్పష్టంగా కనిపించే విధంగా ఉండాలి. అక్షరాలు, అంకెలు మార్పులు చేయరాదు. స్టిక్కర్లు, సింబల్స్, దేవుళ్ల ఫోటోలు, డిజైన్ ఫాంట్లు ఉపయోగించి ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు వాడటం చట్ట విరుద్ధం. నంబర్ ప్లేట్‌ను వంచడం, దాచడం, రంగు మార్చడం నేరం. అన్ని వాహనాలకు ప్రభుత్వం నిర్దేశించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ (హెచ్ ఎస్ ఆర్ పి) తప్పనిసరిగా ఉండాలి. నంబర్ ప్లేట్లు లేని, తప్పుడు రిజిస్ట్రేషన్ నంబర్, చదవలేని అస్పష్టం గా ఉన్న నంబర్ ప్లేట్లు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి తగు చర్య తీసుకొవడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడుతుందని తెలిపారు. వాహనాలకి పరిమితులకు లోబడే ఎల్ఈడి లైట్స్ అమర్చుకోవాలని, వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వాడకూడదు. అనుమతించబడిన వేగ పరిమితులలో సురక్షితంగా వాహనాలు నడపవలెను. (ఓవర్-స్పీడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేయటం నేరం). అనుమతించబడిన సైలెన్సర్ లు తప్ప శబ్ద కాలుశ్యం అధిక ధ్వని ఉండే సైలెన్సర్ లు, హరన్ లు ద్విచక్ర వాహనాలకు అమరిస్తే అటువంటి వాహనాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని, రిఫ్లెక్టివ్ టేపులు, టెయిల్ లైట్లు, అండర్ రన్ సేఫ్టీ ప్రొటెక్షన్ పరికరాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తక్కువ కాంతి పరిస్థితులలో దృశ్యమానతను మెరుగుపరచడం గురించి అవగాహన కల్పించడం. లేన్ క్రమశిక్షణ గురించి అవగాహన తీసుకురావడం, ట్రాఫిక్ ప్రవాహానికి వ్యతిరేకంగా డ్రైవింగ్ చేయకపోవడం (వన్ వే ఉల్లంఘన లేదా రాంగ్ సైడ్ డ్రైవింగ్), ట్రాఫిక్ సిగ్నల్‌ను పాటించడం (రెడ్ లైట్ జంపింగ్), డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్‌ను ఉపయోగించరాదని తెలిపారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న, యాంత్రికంగా సరిపోయే వాహనాన్ని (వాహనం యొక్క ఫిట్‌నెస్) ఉపయోగించే అధికారం కలిగిన వ్యక్తి వాహనం నడపడం గురించి అవగాహన కల్పించడం. అన్ని స్కూల్ బస్సులకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పర్మిట్ తప్పనిసరిగా ఉండాలి. బస్సు ముందు, వెనుక భాగంలో స్పష్టంగా "స్కూల్ బస్సు" అని వ్రాయబడి ఉండాలి. బస్సు నడిపే డ్రైవర్‌కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, కనీస అనుభవం ఉండాలి. బస్సు లో పిల్లల సంఖ్యకు మించి ఓవర్ లోడింగ్ చేయరాదు. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్ తప్పనిసరిగా ఉండాలి. బస్సు తలుపులు, కిటికీలు సరిగా పనిచేసే స్థితిలో ఉండాలి. స్కూల్ బస్సులో అటెండర్ (ఆయా) తప్పనిసరిగా ఉండాలి. పిల్లలు ఎక్కే, దిగే సమయంలో బస్సును పూర్తిగా ఆపి, భద్రత కల్పించాలి. బస్సు కిటికీలు లేదా తలుపుల వద్ద పిల్లలు వేలాడేలా అనుమతించరాదు. స్కూల్ పరిసర ప్రాంతాలలో నిర్దేశిత వేగ పరిమితి తప్పనిసరిగా పాటించాలి. రోడ్ మధ్యలో డివైడర్ ల పై ఫ్లెక్సి లు పెట్టిన ఎడల తగిన చర్యలు తీసుకొన బడును. ప్రజలు అందరూ ఈ నియమాలు పాటిస్తూ సహకరించాలని ఏఎస్పీ కోరారు.



# ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికా ప్రకారంగా అభివృద్ధి చేస్తా..

## సర్పంచ్ కిసర్ నిర్మల మోహన్ రెడ్డి

**కల్లూరు జనవరి 05(జనంసాక్షి)..**
పేరు వంచ పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికా ప్రకారంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని గ్రామ సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో ప్రజలు ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించాలని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలని, పారిశుధ్యం పై దృష్టి సాధించాలని, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కోతులు కుక్కల నియంత్రణకు ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని అంతర్గత రహదారులు అభివృద్ధి పరచాలని, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని తదితరు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సర్పంచ్ పంచాయతీ కు ప్రభుత్వ వంగా వచ్చే నిధులను ప్రణాళికా ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించి ప్రజా సమస్యల పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. గ్రామసభలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి పాలకవర్గం తీర్మానించడం జరిగింది. గ్రామ పంచాయతీ కార్యాలయం ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి అభివృద్ధి పరచడం వచ్చే వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ఉన్న చేతి పంపులు మరమ్మతులు చేసి త్రాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టటం .స్మశాన వాటిక వద్ద గల బోర్ కెసింగ్ 120 అడుగుల వరకు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలపై గ్రామసభల చర్చించి ఆమోదించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ పరిమి కృష్ణవేణి భరత్, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డుమెంబెర్స్ కోట ఉపేంద్ర (బన్నీ), కొండపల్లి మురళి, బడుగు వెంకటేశ్వరావు, జోన బోయినపుష్పలత గోపాల రావు, మంచాల శిరోమణి మాధవరావు, కొనకల్లా



తిరుపతి రావు, సుంకర నాగలక్ష్మి చారీ,గాదె వెంకటరమణమ్మ కిరణ్, విశ్వాష్, గ్రామ పరిధిలో గల వివిధ శాఖలకి సమంధిచిన అధికారులు మరియు ఆశవర్కర్స్ ,అంగన్వాడీ సిబ్బంది,గ్రామ దీపిక,, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



### తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమమే

# టీడబ్ల్యూజెఎఫ్ లక్ష్యం

**సూర్యాపేట(జనంసాక్షి):**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలపై ఉద్యమించడంతో పాటు యూనియన్ బలోపేతానికి భారీ స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో ఫెడరేషన్ సూర్యాపేట అడ్ హక్ జిల్లా కమిటీ ఆధ్వర్యం లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అడ్ హక్ కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులు రాష్ట్రంలో గుర్తింపు పొందాల్సిన అవసరం ఉందన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో జర్నలిస్టుల సమస్యలు నిర్లక్ష్యం చేయ బడ్డాయని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై జర్నలిస్టుల హక్కుల కోసం న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నామనిఅన్నారు. అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇల్లు,ఇంటి స్థలం, హెల్త్ కార్డు, అక్రిడిటేషన్ కార్డు లభించాలన్నదే టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన డిమాండ్ అని, ఈ డిమాండ్ల పై ప్రభుత్వం స్పందించకపోతే, దశలవారీగా పోరాటం చేపడతామని అన్నారు.అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల పక్షాన పోరాడేందుక టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ బలోపేతం అవుతుందని తెలిపారు. సూర్యాపేట జిల్లాలో సభ్యత్వ నమోదు జరుగుతుందని, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాల్లో జరిగే సభ్యత్వ నమోదు సందర్భంగా జర్నలిస్టులు సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో జిల్లా మహాసభ జరుగుతుందని, సభ్యులందరు మహాసభకు సమాయత్తం కావాలని కోరారు.పలువురు జర్నలిస్టులు సంఘ సభ్యత్వాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పాల్వాయి జానయ్య, కో కన్వీనర్లు ముషం హరిప్రసాద్, లింగాల సాయిబాబా, శ్రీరాముల కృష్ణ, నందిపాటి సైదులు, గూడపూరి ప్రభు, నజీర్ ఖాన్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి రంగోత్సవ్ పోటీలలో

# స్మార్ట్ కిడ్జ విద్యార్థుల ప్రతిభ

**ఖమ్మం, జనవరి 5, (జనంసాక్షి):**
జాతీయ స్థాయి రంగోత్సవ్ హ్యాండ్ రైటింగ్ మరియు కలరింగ్ పోటీలలో స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు ప్రతిభ కనపరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన వివిధ తరగతుల విద్యార్థులు 39 మంది జాతీయ పోటీలలో బహుమతులు గెలుచుకున్నారు. విజయం సాధించిన విద్యార్థులకు సోమవారం పాఠశాల కరెస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మెడల్స్ ను అందించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులు లాస్య ప్రియ, వేధన్య, మోక్షిత్ కృష్ణ, మనీష్,పునర్వి, యోగితారెడ్డి, ప్రణీత శ్రీ ,జస్విక్, స్వీ కృతి, గాత్రి, అభయ్ కృష్ణ, సాయి స్కందన్, నిరూప, ప్రహాసిని, ధన్విక్, ధాత్రి శ్రీ, కార్తీ సుదీక్ష ,సాయిష్, యక్షిత్, వీక్ష, మోక్షశ్రీ, ముబీనలి, చతుర్వేద్, ఆద్య, సహస్ర, దీపక్, హర్షిత, రిషాన్ జాదవ్, పవిత్ర, యశస్విని లకు మెడల్స్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులు రంగోత్సవ్ జాతీయస్థాయి పోటీలలో మెడల్స్ సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పాఠశాల విద్యార్థులు పలు రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి పోటీలలో బహుమతులు సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నారని పేర్కొన్నారు. చదువుతోపాటు విద్యార్థులను



అన్ని రంగాలలో తీర్చిదిద్దడం వలన తమ పాఠశాల విద్యార్థులు ఉన్నత స్థాయి పోటీలలో రాణిస్తున్నారని తెలియజేశారు. ఈ విద్యార్థుల అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



### ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

### జూనియర్ సివిల్ జడ్జి ఎండి గౌస్ పాషా

**తుంగతుర్తి జనవరి 5 (జనంసాక్షి)**
ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తుంగతుర్తి జూనియర్ కోర్టు సివిల్ జడ్జి మొహమ్మద్ గౌస్ పాషా అన్నారు, సోమవారం మండల కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు, వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, ఆటోల్లో ఎక్కువ మంది ప్రయాణికులను తీసుకెళ్లొద్దని సూచించారు. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా చనిపోతే ప్రపంచంలో ఒక సంఖ్య మాత్రమేనని కానీ మన కుటుంబానికి మనమే ప్రపంచమని అది మర్చిపోకుండా ఉండాలన్నారు. రోడ్డు సేఫ్టీ అనేది చాలా ముఖ్యమని, రోడ్డుమీద ప్రయాణం చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, మన గురించి మన ఇంటి వాళ్ళు చూస్తుంటారని, మన కుటుంబం అనే ఆలోచనతో ఉండాలన్నారు. అనంతరం రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్, కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాస్, న్యాయవాదులు కారింగుల వెంకటేశ్వర్లు, వజీర్, కుంభం రణధీర్, జిల్లా కుమారస్వామి, జిలకర చంద్రమౌళి, గుగులోతు రాజారాం నాయక్, మల్లెపాక రవి, బానోతు సతీష్, వాహనదారులు కటకం సూరయ్య, బత్తుల జలేంధర్, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



# ఐ టి సి క్యాజువల్స్ కు అనాదిగా అన్యాయం జరుగుతుంది

### ○ బాధితుడుకి పరామర్శ ○ మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్

**బూర్గంపహాడ్ జనవరి 05 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం పారిశ్రామిక ప్రాంతమైన సారపాక ఐ టి సి కర్మాగరంలో గాయపడిన బాధితుడిని పరామర్శించిన సారపాక మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్ కర్మగారంలో పనిచేస్తున్న క్యాజువల్ కార్మికులకు అనాదిగా అన్యాయం జరుగుతుందన్నారు. ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్యాజువల్ కార్మికుడిని సారపాక మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్ పరామర్శించారు. రోజువారీ విధుల్లో భాగంగా కర్మాగారంలో వన్ ఏ మిషన్లో రివైండర్ వద్ద పేపర్ రీల్స్ కట్ చేస్తుండగా బత్తుల కిషోర్ కు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ ధరావత్ చందు నాయక్ ఆసుపత్రికి వెళ్లి బాధితుని పరామర్శించి జరిగిన ప్రమాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాయపడిన



బత్తుల కిషోర్ కు కంపెనీ నుండి అన్ని రకాల న్యాయం జరిగేలా కంపెనీ పై ఒత్తిడి తెచ్చి అతని కి న్యాయం జరిగేలా చేస్తానని అన్నారు. క్యాజువల్స్ కు అనాదిగా జరుగుతున్న ఈ అన్యాయంపై వారికి తోడుగా ఉండి, ఎంప్లాం ఝస్ యూనియన్స్ తో సంబంధం లేకుండా క్యాజువల్స్ అగ్రిమెంట్ నేరుగా కంపెనీ యాజ మాన్యం క్యాజువల్ జె. ఎ. సి తో సంప్రదించి, వారి న్యాయపరమైన కోర్కెలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దాసరి సాంబయ్య, రఘు, సురేష్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# వెనిజులా పై అమెరికా దాడిని ఖండించండి



**ఖమ్మం, (జనంసాక్షి):** అమెరికా వెనిజులాపై చేపట్టిన దౌర్జన్య చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా సిఐటియు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండు వెనుక ఆటో స్టాండ్ వద్ద ప్ల కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్ మాట్లాడుతూ వెనిజులా అధ్యక్షుడు పై తప్పుడు కేసుల పేరుతో వెనిజులా దేశంలోని పౌరులపై క్రూరమైన దాడి జరిపిన అనంతరం, వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మదురోను ఆయన భార్య సిరియా ఫ్లోరెస్ తో సహా అమెరికా దళాలు భారీ స్థాయిలో దాడి నిర్వహించి అరెస్టు చేసింది. ఇది అంతర్జాతీయ చట్టాలకు స్పష్టమైన ఉల్లంఘన కాగా, అమెరికా సామ్రాజ్యవాదానికి నిదర్శనమైన భయంకరమైన చర్యగా సిఐటియు భావిస్తోంది. ప్రజాస్వామ్యం, సామాజికవాద విలువలను గౌరవించే సంస్థగా, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న వెనిజులా ప్రజలతో సంఘీభావం ప్రకటించడం సిఐటియు బాధ్యత. మదురోను వెంటనే విడుదల చేయాలని, వెనిజులాపై అమెరికా చేసిన కక్షపూరిత చర్యలకు బాధ్యత వహించి వెంటనే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురో ను ఆయన భార్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి రమ్య, వై విక్రమ్, జిల్లా ఉపేందర్ జిల్లా సహాయ కార్యదర్శులు దొంగలు తిరుపతిరావు నవీన్ రెడ్డి, బందారు యాకయ్య జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున్ రెడ్డి, నాయకులు మాచర్ల గోపాల్, దేవల వీరబాబు, ఎస్కే ఇమామ్ ,వీరభద్రం, డ్రైవర్లు రమేష్, ఉపేందర్ ,సతీష్, నాగేశ్వరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల చరిత్ర పోరాటాలతోనే ప్రజలతో మమేకం

### ఈనెల 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండ జమ్ముల జితేందర్ రెడ్డి

**మధిర, జనవరి 05 (జనంసాక్షి):** మధిర మండలం: భారత గడ్డపై సీపీఐ నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 18 ఖమ్మం లో జరిగే సిపిఐ వంద సంవత్సరాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ జిల్లా ప్రచార జాత ఈరోజు మధిర మండలం మల్లారం గ్రామం చేరింది మల్లారం గ్రామంలో ఉన్నటువంటి కార్యకర్తలు భారీగా బైకులతో స్వాగతం పలికారు మల్లారం గ్రామంలో మల్లారం గ్రామ మాజీ సర్పంచ్ అమరజీవి కామ్రేడ్ మచ్చా హనుమంతరావు గారి స్థూపానికి సిపిఐ రాష్ట్ర నాయకులు మాజీ ఎంపీటీసీ అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వర రావు విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించి అనంతరం గ్రామ శాఖ కార్యదర్శి పరుచూరి రాము అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల ఈ చరిత్రలో అలుపెరుగని పోరాటాలు చేసి అనునిత్యం ప్రజల గుండెల్లో ఉన్నటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో అనేక రాష్ట్రాలలో సాయిధ పోరాటాలను నిర్వహించి దేశవ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర ఉంది ఈరాష్ట్ర ఏ ఊరు వెళ్ళిన భారత కమ్యూనిస్టు పార్టీ అడుగుజాడలు కనబడుతూనే ఉంటాయని దానిని చెరపటం ఎవరు తరం కాదని ఆయన అన్నారు ఈరోజు మతోన్మాద శక్తులు కమ్యూనిస్టులపై అనేకమైనటువంటి దాడులు నిర్వహించేటువంటి క్రమంలో ప్రజలు చైతన్యవంతులై ఈ మతోన్మాద ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. తెలంగాణరాష్ట్రం లో ఖమ్మం జిల్లాకు ఒక సుదీర్ఘ మైనటువంటి చరిత్ర ఉందని ఈ జెండాని ఖమ్మం జిల్లా ప్రజలు కడుపులో పెట్టుకొని ప్రేమించారని ఖమ్మం జిల్లా అంటే పోరాటాల కిల్లగా పేరు ఉన్నటువంటి ఈ గడ్డపై దేశవ్యాప్త భారత కమ్యూనిస్టు పార్టీ నూరు వసంతాల ముగింపు సభ జనవరి 18న జరుగుతుందని ఈ సభకు వేలాదిగా గ్రామ గ్రామాన నుంచి వచ్చి ఒక సభను విజయవంతం చేసి బడుగు బలహీన



వర్గాలకు ఇంకా ఆశాజ్యోతి గా ఉన్నటువంటి సిపిఐని మరింత ముందుకు నడపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు సీతామాలక్ష్మి మందడపు రాణి సిపిఐ మండల కార్యదర్శి ఉట్ల కొండల రావు సిపిఐ మండల నాయకులు మచ్చ వెంకటేశ్వరరావు, మచ్చ పద్మ, కొంగర మురళి కృష్ణ గ్రామ సహాయ కార్యదర్శి గరిదేపల్లి. వెంకటేశ్వరరావు, దారిల్లి వెంకటేశ్వర్లు ఎర్ర నాగుల సైదులు మందడపు మురళీకృష్ణ సుజాత కృష్ణారావు వెంకట లక్ష్మి మరియమ్మ ఆరిగెల రవి సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ అందుల దినోత్సవం



**తుంగతుర్తి జనవరి 5(జనం సాక్షి)** లూయిస్ బెయిల్ జన్మదిన సందర్భంగా ప్రపంచ అంధుల దినోత్సవాన్ని మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగావెలుగుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దాచేపల్లి వెంకట్ రెడ్డి ,తుంగతుర్తి, తుంగతుర్తి ఎస్సీ కాలనీ కరివిరాల, కొత్తగూడెం అన్నారం, అన్నారం ఎస్సీ కాలనీ, వెలుగు పల్లి ,అన్నారం, కరివిరాల ఉన్నత పాఠశాలల 600 విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు మరియు చాక్లెట్ల పంపిణీ చేశారు ఇట్టి కార్యక్రమంలో మండల విద్యాధికారి బోయిన లింగయ్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి రఘుపతి, గురువయ్య, శ్రీరాములు పి ఆర్ టి యు టియస్ మండల ప్రధాన కార్యదర్శి పి చంద్రశేఖర్ టీఎస్ యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



**మధిర, జనవరి 05 (జనంసాక్షి):** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తతో ఉండాలని, గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి ప్రవర్తనతో చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని మధిర టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కిషోర్ అన్నారు. సైబర్ నేరాల పట్ల సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహ దేవపురంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు లు సాధు సమాధానం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, నేటి సమాజంలో కొందరు విద్యార్థులు సెల్ ఫోన్ లకు బానిసై నేర ప్రవర్తన కలిగి వ్యవహరిస్తున్నారని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని అటువంటి వాటికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, నేరం చేసేవారు ఎంత పెద్ద వారైనా కఠినంగా శిక్షించబడతారని ఆయన అన్నారు. సెల్ ఫోన్ లో వచ్చే ఓటీపీలు, ఏకేపీ వంటి ఫైల్స్ ను ఎట్టి పరిస్థితుల్లో ఓపెన్ చేయకూడదని అపరిచితుల నుండి వచ్చే వాట్సాప్ వీడియో కాల్స్ ఎట్టి పరిస్థితుల్లో లిఫ్ట్ చేయకూడదని డిజిటల్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఈ విష యాలను తల్లిదండ్రులు కూడా తెలియ పరచాలని టౌన్ ఎస్ఐ అన్నారు. అదే విధంగా మైనారిటీ తీరని పిల్లలు వాహనా లను నడిపితే కఠినంగా చర్యలు తీసు కుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోహెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ రెడ్డి, టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది , పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అందరివాడు'కు ఆత్మీయ సన్మానం

○ ఆర్యవైశ్య మహాసభ వేదికగా సేవా సంకల్పం

○ టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తికి సత్కారం



**ఖమ్మం, జనవరి 5, (జనంసాక్షి):** ఖమ్మం గుట్టల బజార్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవ్యాలయం ప్రాంగణంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశం, అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్య సమాజా నికి చెందిన నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావడంతో సభకు విశేష ప్రాధాన్యత లభించింది. ఐక్యతే బలమనే భావన సమావేశమంతా ప్రతిధ్వనించింది. సమావేశంలో ఇటీవల ఎన్నికైన గ్రామపంచాయతీ ఆర్యవైశ్య చైర్మన్లు, వార్డు సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్, జూబ్లీ క్లబ్, వివిధ దేవాలయాల పాలకవర్గాలకు ఎన్నికైన ఆర్యవైశ్య ప్రతినిధులను వేదికపై ఘనంగా సత్కరించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ప్రయోజనాలకంటే సమాజ హితానికే ప్రాధాన్యం ఇవ్వాలని, సమిష్టి కృషితోనే ఆర్యవైశ్య సమాజానికి గౌరవం పెరుగుతుందని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్ । హెచ్-2843) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తిను ఆహ్వానించి, 'అందరి వాడు' గా గుర్తింపు పొందిన ఆయనను సభ వేదికపై ఆత్మీయంగా ఘన సన్మానం చేశారు. నిష్పక్షపాత జర్నలిజంతో ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి స్వరంగా నిలుస్తున్న ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతమైన మీడియా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు జరిపారు. సేవా కార్యక్రమాల విస్తరణ, యువతను సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం, సాంస్కృతిక విలువల పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటూ సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# శ్రీ బాలాజీ రూఫింగ్ ఇండస్ట్రీ నూతన ప్రారంభోత్సవం

## ప్రజల నివాస వాణిజ్య వ్యాపార అవసరాలకు రూఫింగ్ ఇండస్ట్రీ



**కొండమల్లేపల్లి, జనవరి 5 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి మండల పరిధిలోని సాగర్ హైవే పెండ్లిపాకల రోడ్ చిన్న అడిశర్లపల్లి గ్రామంలో సోమవారం శ్రీ బాలాజీ రూఫింగ్ ఇండస్ట్రీ యాజమాన్యం పోలా శంకరయ్య, బెలిదె శ్రీనివాసులు, వేముల బాలరాజు, గందె రవి కుమార్ కుటుంబ సభ్యులు ఆత్మీయ బంధు మిత్రులతో కలిసి శ్రీ బాలాజీ రూఫింగ్ ఇండస్ట్రీ నూతన ప్రారంభోత్సవం సందర్భంగా గణపతి, సరస్వతి, లక్ష్మి, యంత్ర పూజలు, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూఫింగ్ పరిశ్రమ చాలా పురాతనమైందని, ప్రాచీన నాగరికతలో గడ్డి, వెదురు వంటి సహజ వస్తువులతో మొదలైందని అన్నారు. 19వ శతాబ్దంలో పారిశ్రామిక ఉత్పత్తి, 20వ శతాబ్దంలో వాణిజ్య వ్యాపార అవసరాలకు రూఫింగ్ ఇండస్ట్రీ వ్యవస్థ ఉపయోగం అన్నారు. సాధారణంగా పైకప్పులు ప్రతిరోజు ప్రమాదకర పరిస్థితులకు గురవుతాయని కాలక్రమణ దెబ్బతిని చెడిపోవచ్చు అని అన్నారు. గృహ నిర్మాణాలకు వ్యాపార వాణిజ్య అవసరాలకు రూఫింగ్ వ్యవస్థ చాలా ముఖ్యమైనదని వినియోగదారులకు ప్రమాదాల నుండి రక్షించి దీర్ఘకాలం మన్నికగా ఉంటుందన్నారు. రూఫింగ్ వ్యవస్థతో తయారైన వివిధ రకాల రేకులు వర్షం మంచు వడగళ్లు సూర్యకాంతి ఉష్ణోగ్రత తీవ్రత ఇతర పర్యావరణ పరిస్థితులకు మన్నికైనవి మాత్రమే కాకుండా దశాబ్దాల కాలం ఉపయోగంలో ఉంటాయన్నారు. అనంతరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రముఖులను శ్రీ బాలాజీ రూఫింగ్ ఇండస్ట్రీ యాజమాన్యం అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఏ సిరాజ్ ఖాన్, పిసిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఉట్కూరి వేమన్ రెడ్డి, సర్పంచులు పసునూరి యుగేందర్ రెడ్డి, పందుల వెంకటయ్య, మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, కర్నాటి జనార్ధన్, చీదెళ్ల వెంకటేశ్వర్లు, పల్లా కరుణాకర్ రెడ్డి, పోలా శ్రీనివాస్, వేముల వినోద్, పార్ బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సముద్రాల వెంకటేశ్వర్లు, నీలా లక్ష్మయ్య, అలంపల్లి ధనయ్య, ఆర్యవైశ్య సంఘాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్న ఆవును రక్షించిన ఉప సర్పంచ్

**మణుగూరు, జనవరి 05 (జనంసాక్షి):** ప్రమాదంలో చిక్కుకున్న ఆవును దూడను మానవత్వంతో ఆస్పత్రికి తరలించిన సమితి సింగారం గ్రామ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ సోమవారం మణుగూరు మండలం, సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో అశోక్ నగర్ మెయిన్ రోడ్డు లో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆవు దూడ వెనుక బాగాన రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికుల ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న సమితి సింగారం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ తక్షణమే స్పందించి ఆవు దూడను ప్రభుత్వ పశు వైద్యశాలకు తరలించి రెండు కాళ్ళకు కట్లు కట్టించి చికిత్స చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశు వైద్యశాల సిబ్బంది ప్రతాప్, భద్రం, స్థానికులు జూకంటి వెంకటాచారి, పోశం భాస్కర్, రాములమ్మ, తదితరులు సాయం అందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**టేకులపల్లి,జనవరి 5 (జనంసాక్షి):** ఇల్లందు, కొత్తగూడెం జాతీయ ప్రధాన రహదారిలోని టేకులపల్లి మండల పరిధిలో గల ఆరోమైలు తండా వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. టేకులపల్లి ఎస్ఐ. ఏ. రాజేందర్ కథనం ప్రకారం మండలంలోని తొమ్మిదవ మైలుతండాకు చెందిన గుమ్మడి అశోక్(30)ఇల్లందు నుండి తమ సొంత గ్రామమైన 9వ మైలు తండా గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా,ఆరోమైలు సమీపంలో బైక్ అదుపుతప్పి,కల్వర్టును ఢీకొనడం తో తలకు బలమైన గాయాలు అయ్యి రక్తస్రావం ఎక్కువగా అవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గుమ్మడి భద్రు, జ్యోతి దంపతులకు ఒక్కడే కుమారుడు అశోక్,గత సంవత్సరంలో మృతుని అశోక్ కు వివాహం జరిగిందన్నారు. మృతుని భార్య ప్రస్తుతం ఆరు నెలల గర్భిణీ. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, శవ పరీక్ష నిమిత్తం ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# సూర్యాపేటలో ప్రెస్ క్లబ్ భవనం నిర్మించాలి

## టీఎస్ జెఏ వ్యవస్థాపక అధ్యక్షులు కందుకూరి యాదగిరి




సూర్యాపేట (జనంసాక్షి): ఎంతో పోరాట చరిత్ర కలిగిన ఉద్యమ చరిత్ర కలిగిన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జర్నలిస్టుల ఆత్మగౌరవ ప్రతీక ప్రెస్ క్లబ్ భవనం లేకపోవడం విచారకరమని సీనియర్ పాత్రికేయులు భూపతి రాములు గౌడ్, సుంకరబోయిన వెంకటయ్య యాదవ్ అన్నారు.సోమవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ నుండి ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు నిర్వహించిన శాంతియుత పాదయాత్రకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు.జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అయ్యేందుకు అసోసియేషన్లకు, యూనియన్లకు అతీతంగా ఎవరు జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉద్యమాలకు పిలుపునిచ్చిన తాము తప్పకుండా పాల్గొంటామని తెలిపారు.ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.అనంతరం అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో సొంత భవనం లేదన్నారు.సమాజానికి అక్షరాల కాంతులను నింపి ప్రజలను చైతన్యపరుస్తున్న ఫోర్త్ ఎస్టేట్ గా కొనసాగుతున్న మీడియా ప్రతినిధులకు నిలువనీడ లేకపోవడం బాధాకరమని అన్నారు.అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇన్సూరెన్సులు ఇవ్వాలని కోరారు.ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చి, దాని ద్వారా రాష్ట్రంలో ఎక్కడికైనా ఎలాంటి చార్జీలు లేకుండా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని,వాటిని పరిష్కరించే వరకు తాము ఉద్యమిస్తామన్నారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అన్ని యూనియన్ల వారు కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎస్ జెఏ జర్నలిస్టులతో పాటు ఇతర యూనియన్లకు సంబంధించిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కరాటే బెల్ట్ టెస్ట్ ప్రధానోత్సవం



**బూర్గంపహాడ్ జనవరి 04 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ పీఎస్పీడీ మయూర్ క్లబ్ సెంట్రల్ ప్లాజా వద్ద భద్రాద్రి మార్షల్ ఆర్ట్స్, స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున సౌత్ ఇండియా చీఫ్ జి.శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లో బెల్ట్ నుంచి సీనియర్ బ్రౌన్ బెల్ట్ వరకు బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం ఐటీసీ టీచర్స్ కాలనీ విద్యార్థులు, రెడ్ క్రాస్ బిల్డింగ్ కరాటే జూడో విద్యార్థులు, సారపాక కరాటే జూడో విద్యార్థులు, ఐటీసీ పీఎస్పీడీ మయూరి క్లబ్ కరాటే డోజో విద్యార్థులు 56 మంది పాల్గొన్నారు. తెలంగాణ సీనియర్ కరాటే మాస్టర్ శేఖర్ చేతులమీదుగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే ఇన్స్ట్రక్టర్లు జి.వెంకన్నబాబు, జి.కార్తికేయ, జి.నాగిన్ వర్ధన్, కె.భవమన్యు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పల్లపోతు ప్రసాదరావుకు స్వర్ణ నంది అవార్డు



**మధిర జనవరి 05 (జనంసాక్షి):** సమాజ సేవలో విశిష్ట సేవలు అందిస్తున్న పల్లపోతు ప్రసాదరావుకు ప్రతిష్టాత్మక స్వర్ణ నంది అవార్డు లభించింది. విజయవాడలో విశ్వ జనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును సినీ నటుడు బాలాజీ, సినీ హీరోయిన్ పూర్ణిమ, గౌతమ్ రాజు, విశ్వ జనని ఫౌండేషన్ అధ్యక్షులు బొగ్గరపు బ్రహ్మానందం ఘనంగా అందజేశారు.గత 25 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొంటూ ప్రజల మన్ననలు పొందుతున్నందుకు ఈ గౌరవం లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు , మధిర సేవాసమితి సభ్యులు, సేవాసమితి అభిమానులు ప్రసాదరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో కోనా నరసింహారావు, వేముల నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# వెనిజులా చమురు దోపిడీ చేసేందుకే అమెరికా దుర్మార్గం వెనిజులాపై అమెరికా దాడిని ఖండించండి

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ**

**భువనగిరి, జనవరి 5(జనం సాక్షి)** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురో మరియు ఆయన భార్యని ట్రంప్ ఆదేశాలతో అరెస్ట్ చేసి ఆ దేశంపై అక్రమంగా దాడి చేయడాన్ని సిపిఎం పార్టీగా తీవ్రంగా ఖండిస్తుందని చమురు దోపిడి చేసేందుకే అమెరికా ఈ దుర్మార్గానికి పాల్పడిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ విమర్శించినారు. సిపిఎం పోచంపల్లి మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పోచంపల్లి పట్టణంలోని చౌటుప్పల రోడ్డులో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ ఈ దాడితో అమెరికా సామ్రాజ్యవాద ధోరణి బయటపడిందని అన్నారు. వెనుజుల మీద దాడి తర్వాత ట్రంప్ కు ముకుతాడు వేయకుంటే ప్రపంచానికే ప్రమాదమని తెలిపారు. ఒక దేశ అధ్యక్షున్ని అరెస్టు చేయడం అమెరికా సామ్రాజ్యవాద వైఖరికి పరాకాష్టని విమర్శించారు. అమెరికా బరితేగింపు, బడా కార్పొరేట్ గుత్తాధిపత్యాన్ని ప్రపంచమంతా వ్యతిరేకించాలని తెలిపారు. వెంటనే అరెస్ట్ చేసిన ఆదేశ అధ్యక్షుడు మధురో మరియు వారి భార్యను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ దుచ్చేరియల పైన ఐక్యరాజ్యసమితి వెంటనే కలుగచేసుకోవాలని కోరారు. అమెరికా సామ్రాజ్యవాద చర్యలు ప్రపంచ ప్రజాస్వామ్యానికి నష్టదాయకమని తెలియజేశారు. భారత ప్రభుత్వం కూడా వెంటనే ఈ చర్యని ఖండించాలని నర్సింహ సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ



డివిజన్ కార్యదర్శి గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, పార్టీ మాజీ జిల్లా కమిటీ సభ్యులు పగిళ్ల లింగారెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, పట్టణ కమిటీ సభ్యులు వడ్డేపల్లి యాదగిరి, గూడూరు రామిరెడ్డి, పొన్నమోని కృష్ణ, మండల కమిటీ సభ్యులు కల్యాణి బిక్షపతి, సీనియర్ నాయకులు సిలువేరు లాలయ్య , కొట భూపాల్ రెడ్డి, రజినీ కాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



**ఓటర్ జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**

దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ వై సుదర్శన్ పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఇటీవల ప్రచురించిన ముసాయిదా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలు పై వారితో చర్చించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారిగా ఓటర్ల వివరాలు తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, పలు రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. **జనంసాక్షి , దేవరకొండ**




యువత సక్రమంగా నడిచినప్పుడే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. సోమవారం శ్రీక్రాంతి జూనియర్, డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపరాదని, వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని తన వెంట లైసెన్స్, ఆర్సీ తదితర ధృవపత్రాలను తెచ్చుకోవాలని తెలిపారు. సృష్టిలో ప్రాణానికి మించింది ఏమీ లేదని వాహనాలు నడిపేటప్పుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శ్రీక్రాంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గుంటోజు ఆంజనేయులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుండిగళ్ళ అశోక్, ఏఓ యర్రమాద గోవర్ధన్ రెడ్డి, అధ్యాపకులు చిన్నానాయక్, శేఖర్, నాగయ్య, నరేంద్రచారి, వెంకటేశ్వర్లు, స్నేహ, లిఖిత, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

**జనంసాక్షి, కొండమల్లేపల్లి**

## గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

**సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్**

**ప్రధానోపాధ్యాయులు, విబికేలు, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, అంగన్వాడి, ఉపాధి హామీ, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, వార్డు సభ్యులతో సర్పంచ్ ప్రత్యేక సమావేశం..**

**మర్రిగూడ, జనవరి5 (జనంసాక్షి)** గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడడానికి సిద్ధంగా ఉన్నట్లు సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని యరగండ్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, విబికే లు, వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ అధికారులు, అంగన్వాడి, ఉపాధి హామీ, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది,వార్డు సభ్యులు, యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలతో ప్రత్యేక



సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్ యాదవ్ మాట్లాడుతూ విద్య, వైద్యం, మౌలిక వసతులు, మహిళల ఆర్థిక అభివృద్ధి తోపాటు అన్ని అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ఏ వ్యవస్థలో లోటుపాట్లు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఉప సర్పంచ్ చామకూర కృష్ణమ్మ, వార్డు సభ్యులు దాదె సుమలత, ముద్దం వెంకటయ్య, ఉప్పునూతల అబ్బయ్య, అయితగోని జయమ్మ, వల్లంల యాదయ్య, గుడ్ల రజిత, అందుగుల శ్రీనివాస్, పల్లేటి వెంకటయ్య, ఆకారపు శ్రీను యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా రాజు నాయక్

**అభినందించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బాలు నాయక్**



**కొండమల్లేపల్లి, జనవరి 5 (జనంసాక్షి):** కొండమల్లేపల్లి మండల సర్పంచుల ఫోరం నూతన అధ్యక్షుడిగా 20 మంది సర్పంచులు ఏకగ్రీవంగా కేశ్యతండ గ్రామ సర్పంచ్ రమావత్ రాజు నాయక్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం నూతన మండల అధ్యక్షుడు రమావత్ రాజు నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు సోమవారం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడిని ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ సర్పంచుల సమన్వయంతో మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సర్పంచుల ఫోరం కీలక పాత్ర పోషించాలని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేయాలని సూచించారు. అన్ని గ్రామాల సర్పంచుల సమస్యలు పరిష్కరిస్తు ప్రజాప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా కృషి చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామాల అభివృద్ధి, మౌలిక సమస్యలపై తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. సర్పంచులందరూ నిరంతరం గ్రామాల్లో ఉండే గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా అన్ని గ్రామాల సర్పంచులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అనంతరం నూతన సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రామావత్ రాజు నాయక్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్న మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే బాలు నాయక్ సహకారంతో అన్ని గ్రామాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు రాము, మోతిలాల్, కృష్ణ, రమేష్, రామకృష్ణ, శ్రీపతి, లక్ష్మి, సరిత, అలివేలు, సుగుణ, రమేష్, గోజీ, నాయకులు మధు, ప్రణీత, బాలునాయక్, జగన్ నాయక్, సుఖ్య, సీత్య తదితరులు పాల్గొన్నారు.

## చింపాంజీ మాస్క్ తో కోతుల బెడదకు చెక్

**తుంగతుర్తి జనవరి 5 (జనంసాక్షి)**



గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఇట్టి సమస్యకు మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు చంటి అంజయ్య కు వినూత్న ఆలోచన వచ్చింది, దీంతో తాను తన డబ్బులతో చింపాంజీ మాస్కు కొనుగోలు చేశాడు తానే స్వయంగా చింపాంజీ వేషం ధరించి గ్రామ వీధుల్లో తిరిగాడు. దీంతో కోతులు భయపడి గ్రామ బయటికి వెళ్లిపోయాయి. ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన శైలిలో ముందుకొచ్చి కోతుల బెడద నుండి గ్రామాన్ని రక్షించడంతో మాజీ వార్డు సభ్యుడిపై గ్రామస్తులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా కల్లూరి మల్లేశం ఎన్నిక



**భువనగిరి, జనవరి 5(జనంసాక్షి)** విశాఖపట్టణంలో జరిగిన సీఐటీయూ 18 వ ఆల్ ఇండియా మహాసభలో సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా కల్లూరి మల్లేశం ఎన్నిక అయినట్టు సోమవారం రోజున ఒక ప్రకటనలో తెలియజేశారు. డిసెంబర్ 31 నుండి జనవరి 04 వరకు విశాఖపట్టణంలోని ఆంధ్ర యూనివర్సిటీ ఆడిటోరియం హాల్ లో మహాసభలు జరిగాయని తెలంగాణ రాష్ట్రం నుండి మొదటిసారిగా యాదాద్రి భువనగిరి జిల్లా తరపున ఎన్నికైనట్లు తెలియజేశారు. గతంలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రామన్నపేట డివిజన్ కార్యదర్శిగా ,ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శిగా , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా, కేంద్ర కమిటి సభ్యులుగా , సీఐటీయూ ఉమ్మడి జిల్లా కమిటి సభ్యులుగా, గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా, ఉమ్మడి జిల్లా సహకార సంఘం డైరెక్టర్ గా, యాదాద్రి భువనగిరి జిల్లా టి మాస్ కన్వీనర్ గా , సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులుగా , జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు.ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు.గత 27 సంవత్సరాలుగా ప్రజల సమస్యలపై వివిధ ప్రజా సంఘాలలో పనిచేస్తున్నానని పనిని గుర్తించి నాయకత్వం నాకు జాతీయ కమిటీలో బాధ్యతను అప్పగించిందని తెలియజేశారు.రానున్న రోజులలో కార్మిక సమస్యలపై ప్రజాఉద్యమాలను నిర్వహిస్తూ సీఐటీయూ పటిష్టత కోసం కృషి చేస్తానని, కార్మిక సంఘాల ఐక్యత కోసం, ఐక్య ఉద్యమాల కోసం పనిచేస్తానని తెలియజేశారు.

## నూతన సర్పంచులకు ఘన సన్మానం

**చండూరు జనవరి 5 (జనంసాక్షి)**

చండూరు ఎం.పీ.డీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో యాదగిరి ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన 19 గ్రామ పంచాయతీల సర్పంచులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన సర్పంచులు తమ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల విషయంలో తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.పి ఓ.,లు, ఎం.ఈ.ఓ ఉట్కూరు సుధాకర్ రెడ్డి, కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# సిరిపురంలో రైతుల ఆందోళన

రామన్నపేట, జనవరి 5 (జనంసాక్షి): మండలంలోని సిరిపురం గ్రామంలో సిరిపురం - పెద్దకాపర్తి రోడ్డు ధర్మారెడ్డి పల్లి కాల్వ పై కల్వర్టు నిర్మాణ పనులు ఇరువైపులా రోడ్డుకు ఒక మీటర్ లోతులో సింగిల్ ట్రాక్ కల్వర్టు నిర్మించడంపై సోమవారం రైతులు ఆందోళన చేపట్టి కల్వర్టు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..మీటర్ లోతు సింగిల్ ట్రాక్ కల్వర్టు రోడ్డుకు క్రాస్ గా నిర్మించడంతో లోడ్ ట్రాక్టర్లు, ఆటోలు, వాహనాలు రోడ్డు ఎక్కే పరిస్థితి లేదన్నారు. వర్షాకాలం వస్తే ఇరువైపులా నీరు కల్వర్టుపై చేరి రాకపోకలు నిలిచిపోతాయని ఆందోళనకు దిగారు. అధికారులు పర్యవేక్షణ లేకుండా రోడ్డుకు క్రాస్ గా సింగిల్ కల్వర్టు నిర్మించారని ఆరోపించారు. కాంట్రాక్టర్, వారికి సంబంధించిన వ్యక్తులు నిర్లక్ష్యంగా పొంతనలేని సమాధానం చెబుతున్నారని అన్నారు.అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని వారు ఆరోపించారు. వెంటనే అధికారులు పరిశీలించి డబుల్ లైన్ కల్వర్టును మీటర్ ఎత్తులో నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. నిర్మాణ పనులు చేపట్టే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ అఖిలపక్ష నాయకులు ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష



రమేష్, బండ శ్రీనివాస్ రెడ్డి, కూనూరు ముత్తయ్య, ఏళ్ల సంజీవరెడ్డి, బల్గూరి అంజయ్య, గుంటోజు కృష్ణమాచారి, ఏలే వెంకట నరసయ్య, కట్ట శేఖర్ రెడ్డి రమేష్ నర్ర నర్సిరెడ్డి , ఎల్లా మల్లారెడ్డి గజం సత్యనారాయణ, మోటే మల్లేశం , అప్పం వెంకటేశం, దూలం రవి, శ్రీనివాస్ పబ్బు మల్లయ్య కట్ట లక్ష్మారెడ్డి కూనూరు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట పట్టణ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులుగా గోవర్ధన్ ఎన్నిక

సూర్యాపేట (జనంసాక్షి): సూర్యాపేట పట్టణ ఆర్టిస్టు అధ్యక్షులుగా గోవర్ధన్ ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక మిర్చి యార్డులో జరిగిన ఎన్నికలలో గోవర్ధన్ గెలుపొందినట్లు ఎన్నికల నిర్వాహకులు భాస్కర్, మన్సూర్, ఖదీర్, సత్యం రాజు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గోవర్ధన్ మాట్లాడుతూ పట్టణంలో ఆర్టిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.అనంతరం గోవర్ధన్ ను ఘనంగా సన్మానించారు.సంఘ నూతన అధ్యక్షులుగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కోశాధికారిగా మధు,ఉపాధ్యక్షులుగా విష్ణు శేఖర్, హమీద్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, బిక్షం, లింగరాజు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

కోదాడ, నవంబర్ 5,( జనం సాక్షి): యూపీఏ ప్రభుత్వంలో వామపక్ష పార్టీలు పోరాడి సాధించుకున్న చట్టాన్ని రద్దుచేసి జి రాంజీ పేరుతో కొత్త పథకాలు తీసుకొచ్చి అంతిమంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు విమర్శించారు .ఆదివారం కోదాడ పట్టణంలో స్థానిక రంగా థియేటర్ సెంటర్ లో వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. అనంతరం రాములు మాట్లాడుతూ ఈ చట్టంలో ఉన్న గాంధీజీ పేరును తొలగించడం చాలా అన్యాయమని వెంటనే ఈ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన నుండి ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని ప్రయత్నిస్తుంది అని వారు విమర్శించారు. దేశానికి స్వాతంత్రం తెచ్చిన గాంధీజీ పేరు తొలగించి అంతిమంగా ఈ పథకానికి గాడ్సే పేరును పెట్టాలని ప్రయత్నిస్తుందని వారు విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో నూటికి 80 శాతం ఉన్న వ్యవసాయ కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది అన్నారు జి రామ్ పేరుతో తెచ్చిన ఈ పథకాన్ని రద్దుచేసి వ్యవసాయ కార్మికులకు ఉపయోగపడే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు .మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టంలో సంవత్సరానికి ?200 పని దినాలు రోజుకు 800 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం ముత్యాలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు వీ రాముడు ,వీరయ్య రామారావు,తిరపయ్య వెంకటేశ్వర్లు సైదులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఆర్టీఆర్ఐ మాజీ చైర్మన్‌కు ఘన నివాళి



భూదాన్ పోచంపల్లి, జనవరి 5 (జనంసాక్షి): స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ (ఎస్ఆర్టీఆర్ఐ) మాజీ చైర్మన్ ప్రొఫెసర్ యం.యన్.రెడ్డి మృతి పట్ల సోమవారం భూదాన్ పోచంపల్లి మండలం జలాల్ పూర్ గ్రామంలోని సంస్థ ప్రాంగణంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ యన్.కిషోర్ రెడ్డి, మాజీ చైర్మన్ యం.యన్.రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ అభివృద్ధికి యం.యన్.రెడ్డి చేసిన సేవలు అమూల్యమని కొనియాడారు. ఆయన చేసిన కృషి సంస్థకు బలమైన పునాదిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో వై.యస్.చక్రవర్తి, సంస్థ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.

# డిఎం ను సన్మానించిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగస్తులు

దేవరకొండ, జనవరి 05(జనం సాక్షి) సురక్షిత ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమవుతుందని, ప్రజలందరూ ఎల్లప్పుడూ ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించాలని దేవరకొండ రిటైర్డ్ ఉద్యోగస్తులు తెలిపారు. సోమవారం స్థానిక డిపో రిటైర్డ్ ఉద్యోగస్తుల కమిటీ సభ్యులు నూతన మేనేజర్ విజయ కుమారినీ మర్యాదపూర్వకముగా కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులు వారిని పరిచయం చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మెరుగైన ఉత్తమ సేవలను అందిస్తూ,ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తూ. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ డిపోను రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో సెక్రెటరీ హజరత్ షా,రాజ మల్లయ్య ప్రెసిడెంట్, ఎండి సాదక్ అలీ వైస్ ప్రెసిడెంట్, సిహెచ్ అంజయ్య,ఆర్గనైజింగ్ సెక్రటరీ అలాగే రీజనల్ నాయకులు బాసప్ప మరియు రిటైర్డ్ ఉద్యోగస్తులు ఉన్నారు.






# మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

కోదాడ, నవంబర్ 5,( జనం సాక్షి): యూపీఏ ప్రభుత్వంలో వామపక్ష పార్టీలు పోరాడి సాధించుకున్న చట్టాన్ని రద్దుచేసి జి రాంజీ పేరుతో కొత్త పథకాలు తీసుకొచ్చి అంతిమంగా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు విమర్శించారు .ఆదివారం కోదాడ పట్టణంలో స్థానిక రంగా థియేటర్ సెంటర్ లో వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. అనంతరం రాములు మాట్లాడుతూ ఈ చట్టంలో ఉన్న గాంధీజీ పేరును తొలగించడం చాలా అన్యాయమని వెంటనే ఈ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన నుండి ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని ప్రయత్నిస్తుంది అని వారు విమర్శించారు. దేశానికి స్వాతంత్రం తెచ్చిన గాంధీజీ పేరు తొలగించి అంతిమంగా ఈ పథకానికి గాడ్సే పేరును పెట్టాలని ప్రయత్నిస్తుందని వారు విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో నూటికి 80 శాతం ఉన్న వ్యవసాయ కార్మికుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది అన్నారు జి రామ్ పేరుతో తెచ్చిన ఈ పథకాన్ని రద్దుచేసి వ్యవసాయ కార్మికులకు ఉపయోగపడే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు .మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి చట్టంలో సంవత్సరానికి ?200 పని దినాలు రోజుకు 800 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం ముత్యాలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు వీ రాముడు ,వీరయ్య రామారావు,తిరపయ్య వెంకటేశ్వర్లు సైదులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రజల అవసరాలకు అనుగుణంగా స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు

సూర్యాపేట(జనంసాక్షి): ఆరోగ్య బీమాతో పాటు ప్రయాణ, వ్యక్తిగత ప్రమాదాల నుండి రక్షణకు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు ఎంతో ఉపయోగపడుతాయని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ జోనల్ హెడ్ మణికంఠ, ప్రముఖ గాయకుడు,బహుజన యుద్ధనౌక ఏపూరి సోమన్న, నల్లగొండ డిసిఎంఎస్ చైర్మన్ బొళ్ళ వెంకట్ రెడ్డి అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ రీజినల్ ఆఫీస్ సమీపంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీసును వారు ప్రారంభించి మాట్లాడారు.అనంతరం స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు మాట్లాడుతూ జీవితంలో ఎలాంటి సంఘటనలు జరిగిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ భద్రత తీసుకుంటుందని తెలిపారు.స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ 2006లో రూ.22 కోట్లతో ప్రారంభమై 2025 నాటికి రూ.16 వేల కోట్ల వరకు చేరుకుందని తెలిపారు.2026 సంవత్సరం ముగిసే లోపు 20వేల కోట్లకు పైగా వ్యాపారంకు చేరుకోనున్నట్లు తెలిపారు.హెల్త్ ఇన్సూరెన్స్ కు ప్రభుత్వం జీఎస్టీ తొలగించడం జరిగిందని అన్నారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 850 ఆఫీసులు ఉన్నాయని, 15 కోట్ల మంది తమ కంపెనీ పాలసీలు తీసుకున్నారని అన్నారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీసును సూర్యాపేటలో ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టాటా లైఫ్ మేనేజర్ వెంకట్ రెడ్డి, నలగొండ బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్, రామారావు, సూర్యాపేట స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ బచ్చలకూరి విక్రమ్, పాస్టర్ దుర్గం ప్రభాకర్, దోరేపల్లి ప్రభాకర్, ఎస్ఎంలు, ఏడిఎం లు తదితరులు పాల్గొన్నారు.



**బిఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి రాష్ట్ర కుర్మ సంఘం అధ్యక్షులు క్యామా మల్లేష్ జన్మదిన వేడుకలు**

**భువనగిరి, జనవరి 5 (జనంసాక్షి)**
బిఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి రాష్ట్ర కుర్మ సంఘం అధ్యక్షులు క్యామా మల్లేష్ జన్మదిన వేడుకలుబి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుక్కాపూర్ సర్పంచ్ జనగాం పాండు ఆధ్వర్యంలో జిల్లా పార్టీ ఆఫీస్ లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కటింగ్ చేయడం జరిగింది. వారు మాట్లాడుతు కెసిఆర్ నాయకత్వంలో క్యామా మల్లేష్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం వ్యాప్తంగా చురుకు గా తిరుగుతూ ప్రజల మధ్యనే ఉంటున్న నాయకులు బడుగు బలహీన వర్గాల ఆశ జ్యోతి క్యామా మల్లేశం. రాబోయే రోజుల్లో మంచి పదవుల్లో ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సందేల సుధాకర్, జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేష్ యాదవ్, నక్కల చిరంజీవి యాదవ్, మాజీ సర్పంచ్ బొమ్మరపు సురేష్ కంచనపల్లి నర్సింగ్ రావు, ఉపసర్పంచ్ రాసాల లింగ స్వామి యాదవ్, జనగాం మహేష్, పాశం మహేష్, ఎస్ కే అహ్మద్, ఎస్ కే. యాకుబ్ సైదులు, సాయి యాదవ్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రాఫ్ట్ ముసాయిదా ఓటర్ల జాబితా పై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

**నేరేడుచర్ల( జనంసాక్షి):**
పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వార్డుల వారిగా డ్రాఫ్ట్ ముసాయిదా ఓటర్ల జాబితాను,సంబంధించిన అభ్యంతరాలు సలహాలు,సూచనలు విషయమై,వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు అభ్యంతరాలు లిఖిత పూర్వకంగా ఇవ్వవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ,బిఆర్ఎస్, బిజెపి, బిఎస్పి, సిపిఐ, సీపీఎం, జనసేన, టీడీపీ, సిపిఐఎంఎల్, మొదలగు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి మండల పరిధిలోని కొత్తబాయి గ్రామపంచాయతీలో సోమ వారం ఇందిరా మహిళా శక్తి చీరలను మహిళలకు గ్రామ సర్పంచ్ జబ్బు జంగమ్మ యాదయ్య యాదవ్ తమ చేతుల మీదుగా మహిళలకు అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఆధార్ కార్డు ఉన్న ప్రతి మహిళకు చీరలు అందజేస్తామని అన్నారు. గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు కావలసిన అన్ని మౌళిక సమస్యలను నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఏరుకొండ చంద్రకళ చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి నరసింహ, వార్డు సభ్యులు సైదులు, కొండల్, యాదయ్య, జబ్బుగిరి, రాములు, రామలింగం, వినోద, మహిళా సంఘం సభ్యులు లలిత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.
జనంసాక్షి, కొండమల్లేపల్లి

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం ప్రతిభ చూపిస్తున్న క్రీడాకారులకు అండగా ఉంటాం

## బిఆర్ఎస్ జిల్లా నాయకులు డా. ర్యాకల శ్రీనివాస్

**భువనగిరి , జనవరి 05 (జనంసాక్షి)**
35 వ సబ్-జూనియర్ ఉమ్మడి నల్గొండ జిల్లా ఖో-ఖో ఎంపిక పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లా గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బి ఆర్ ఎస్ జిల్లా నాయ కులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం అని ఎంపికైన క్రీడాకారులను అభినందించారు . క్రీడాకా రులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు భోజన సదుపాయం కల్పించిన ఆయన భవిష్యత్తులో కూడా క్రీడాకారుల కలలు నెరవేరడానికి తన వంతు ఆర్థిక సాయం అంది స్తానని ప్రకటించారు. ప్రతిభ ఉన్న క్రీడా కారులు కేవలం డబ్బు లేక వెనుకబడకూడదనే ఉద్దేశంతో వారికి అన్ని విధాలా అండగా ఉంటానని ఆయన మాట ఇచ్చారు. తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ కృష్ణమూర్తి క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. ఖో-ఖో అనేది వేగంతో కూడిన ఆట అని సబ్-జూనియర్ స్థాయి నుండే క్రీడాకారులు క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొందాలని ఆయన సూచించారు. ఈ జిల్లా స్థాయి ఎంపికలు రాష్ట్ర స్థాయికి , ఆపై జాతీయ స్థాయికి చేరడానికి ఒక గొప్ప పునాది అని ఆయన పేర్కొన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ని మరియు స్థానిక నిర్వాహకు లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అనాజి పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు బాత్క అశోక్ , పి రమేష్ రెడ్డి,పి అంజయ్య,విజయ్,నారి, మధుబాబు, సాయి కుమార్, వెంకటరెడ్డి, జానీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.







## దేవరకొండ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక

**దేవరకొండ, జనవరి 05(జనంసాక్షి)**
దేవరకొండ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా మైనంపల్లి సర్పంచ్ కొర్ర రామ్ సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల సర్పంచుల ఫోరం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చాట్ల రమాదేవి రాములు తెలుగుపల్లి సర్పంచ్, చల్లమల విజయ్ గౌడ్ తాటికోల్ సర్పంచ్, ప్రధాన కార్యదర్శి ముదిగొండ శ్యామలయ్య కాసారాం సర్పంచ్,సహాయ కార్యదర్శి నేనవత్ కవిత లచ్చిరామ్ నాయక్ సూర్యతండా సర్పంచ్,గౌరవ అధ్యక్షులుగా వెంకటేశ్వర రావు నాగవరం బొడ్డుపల్లి సర్పంచ్, కోశాధికారి గా రత్లవత్ జగన్ నాయక్ వడిత్య తండా సర్పంచ్,ఇసి సభ్యులుగా గోపాల్ నాయక్.గణ్యా నాయక్ తండా సర్పంచ్,నేనవత్ భీముడు నాయక్ వెంకట్ తండా సర్పంచ్, పల్లా శ్రీకాంత్ రెడ్డి పడమటి పల్లి సర్పంచ్,కోన్ రెడ్డి శ్రీను కొండ భీమనపల్లి సర్పంచ్,వడిత్య పద్మ బాలరాజు శేరిపల్లి సర్పంచ్, ముంత విజయలక్ష్మి మల్లేష్ సర్పంచ్, ముదిగొండ పాత్లవత్ భారతి ధర్మ సర్పంచ్, పాత్లవత్ తండా పి గార్లను నేడు దేవరకొండ పట్టణంలోని స్పోర్ట్స్ భవన్ నందు అందరూ సర్పంచుల సమక్షంలో అందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఏకగ్రీవ ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గానికి ఒకరినొకరు అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతూ తమ తమ గ్రామాలను స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ సహకారంతో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

## బాధ్యతల స్వీకరణ..

**సూర్యాపేట (జనంసాక్షి):**
టీజీఎస్ ఆర్టీసీ సూర్యాపేట డిపో మేనేజర్ గా వి.సునీత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సత్తుపల్లి డిపో నుండి సూర్యాపేటకు బదిలీపై వచ్చారు.





## బీబీనగర్ ఎయిమ్స్ ను సందర్శించి,పనుల పురోగతి పై సమావేశం నిర్వహించిన బోర్డు సభ్యురాలు మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ

**భువనగిరి, జనవరి 05(జనంసాక్షి)**
యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ ఎయిమ్స్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ లో ఎయిమ్స్ బోర్డు మెంబర్,మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత అగర్వాల్, ఎయిమ్స్ అకడమిక్ డీన్ నితిన్ అశోక్ జాన్, ఎయిమ్స్ మెడికల్ సూపరిండెంట్ మహేశ్వర్ లక్కిరెడ్డితో సమావేశం నిర్వహించారు.అనంతరం పవర్ పాయింట్ ప్రసంటేషన్ ద్వారా బీబీనగర్ ఎయిమ్స్ లో జరుగుతున్న పనుల పురోగతి, అందిస్తున్న సేవలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత అగర్వాల్ వివరించారు.ఎయిమ్స్ లో అందిస్తున్న ఓపీ సేవలు, టెస్టుల ప్రోగ్రెస్, పీజీ, యూజీ వైద్య విద్యార్థుల హాస్టల్ టవర్స్ నిర్మాణం, ఆడిటోరియం, వివిధ విభాగాల ల్యాబ్స్, ఎమర్జెన్సీ బిల్డింగ్ ల పనులు ప్రణాళికబద్ధంగా టైం డెడ్ లైన్ పెట్టుకొని పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.ఎయిమ్స్ లో కొనసాగుతున్న నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని,ప్రస్తుతం ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు మెరుగుపరచడంతో పాటు, పూర్తి స్థాయి వైద్య సేవలు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ గారు,కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా చేస్తున్న కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎయిమ్స్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందుతాయని,ఎయిమ్స్ లో అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో సేవలు, తక్కువ ఖర్చుతో పేద, మధ్యతరగతి ప్రజలకు అందుతాయని అంతేకాక కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం తో పాటు ఆరోగ్య శ్రీ సేవలు కూడా ఎయిమ్స్ లో అందుబాటులో ఉన్నాయని త్వరలోనే అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.సమావేశం అనంతరం ఎయిమ్స్ బోర్డు సభ్యులు ఎంపీ డీకే అరుణ ని బీబీనగర్ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత అగర్వాల్ మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించి, బీబీనగర్ ఎయిమ్స్ మెమెంటో బహుకరించారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ఆవరణలో మొక్కలను నాటారు.



# తెలంగాణ ఉద్యమకారుల మహాసభను జయప్రదం చేయాలి

◆ఈ నెల 10న సూర్యాపేటలో నిర్వహణ ◆తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

◆తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కళ్లేపు చంద్రన్న ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిడమర్తి లింగన్న అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులను జారీ చేయాలన్నారు. 250 గజాల ఇంటి స్థలంతో పాటు నాలుగు గదుల ఇండ్లను ఉద్యమకారులకు నిర్మించి ఇవ్వడంతోపాటు నెలకు 30వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరులైన 1200 మంది అమరుల కుటుంబాలకు 10 లక్షల నగదు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. తొలి దశ అమరుల కుటుంబాలకు సైతం ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల న్నారు. తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు. అమరవీరుల స్ఫూర్తి వనంను వంద ఎకరాల్లో ఏర్పాటు చేయడంతో పాటు సెక్రటేరియట్ ముందున్న అమర జ్యోతి మ్యూజియంను అధికారికంగా ప్రారంభించి సందర్శకులకు అనుమతి ఇవ్వాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఉద్యమ అమరులకు స్మారక భవనం నిర్మించాలని పేర్కొన్నారు.ఉద్యమకారుల అమరుల కుటుంబాలకు బీమా సౌకర్యం, హెల్త్ కార్డులు, ఈఎస్ఐ సౌకర్యం, ఉచిత బస్ పాస్ అందజేయాలన్నారు. ఉద్యమకారుల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలతో పాటు విద్య, ఉద్యోగ, రాజకీయాలలో మొదటి ప్రాధాన్యత ఇస్తూ రెండు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.ఉద్యమ సమయంలో నష్టపోయిన ఉద్యమకారులకు 50 శాతం సబ్సిడీతో కోటి రూపాయల రుణాలు ప్రభుత్వమే నేరుగా అందించాలన్నారు.తెలంగాణ అమరవీరుల చరిత్రను, తెలంగాణ విద్యార్థి ఉద్యమ చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు.ఈ మహాసభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుండిగల అంజన్న, ఓగిరాల సుజ్జి, జర్నలిస్ట్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మోహన్ బైరాగి, సిపిఐ నాయకులు దంతాల రాంబాబు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్, టీజెఎస్ నాయకులు నారబోయిన కిరణ్,బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు, రైతాంగ సమితి నాయకులు నల్లేడ మాధవరెడ్డి, బహుజన మహాసభ నాయకులు నారబోయిన వెంకట యాదవ్, దళిత సేవా సమితి అధ్యక్షులు ఇటికల ఆంజనేయులు, జేఏసీ నాయకులు మేడబోయిన గంగయ్య యాదవ్,మట్టా రాజన్న, దయాకర్,చామకూరి నరసన్న, నావెల్లే ఉపేందర్, యూసఫ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలని (వాడ) నుండి అంగన్వాడి కేంద్రాన్ని తరలించే ప్రతిపాదన విరమించుకోవాలి

స్లాబ్ పెచ్చులు ఊడుతున్న అంగన్వాడి కేంద్రానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా

**భువనగిరి రూరల్ , జనవరి 05(జనంసాక్షి)**
అనాజిపురం గ్రామంలోని ఎస్సీ కాలని (వాడ) నుండి అంగన్వాడి కేంద్రాన్ని మార్చాలనే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్లాబ్ పెచ్చులు ఊడుతున్న అంగన్వాడి కేంద్రానికి వెంటనే నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని రెండవ రోజు నిర్వహించినారు. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ సర్వే సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సామాజిక, ఆర్థిక సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని ప్రధానంగా దళిత వాడలో దళిత పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడానికి, ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఫ్రీ - స్కూల్ విద్య అందించడానికి అందరికీ అందుబాటులో వారి మధ్యన ఏర్పాటు చేసిన అంగన్వాడి కేంద్రాన్ని వివిధ కారణాలు, కుంటి సాకులు చెప్పి మార్చాలని చూస్తున్న అధికారుల ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దళితులు విద్యపరంగా, వైద్యపరంగా, ఉపాధిపరంగా, హార్థికపరంగా వెనుకబాటు గురవుతున్న పరిస్థితి ఉన్నదని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్న దళితుల స్థితిగతులలో మార్పు రాలేదని పాలకులు మారిన దళితుల జీవితాల్లో మాత్రం రాలేదని నేటికీ అనేక రంగాలలో వెనకబాటుకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అనాజిపురం గ్రామంలో దళితవాడలో ఉన్న అంగన్వాడి కేంద్రం దళిత ప్రజలకు బాగా ఉపయోగపడుతుందని అలాంటి కేంద్రాన్ని మార్చొద్దని సూచించారు. అంగన్వాడి కేంద్రము 2010 సంవత్సరంలోనే నిర్మాణం చేసినారని అక్కడక్కడ బిల్డింగ్ సంబంధించిన స్లాబు పెచ్చులు ఊడుతున్నాయని వాటికి తక్షణము నిధులు కేటాయించి మరమతులు చేపడితే ఎలాంటి ఇబ్బంది ఉండదని అందుకు జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు స్పందించి నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. మరమ్మతులు చేపట్టకుండా అంగన్వాడి కేంద్రాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని చూస్తే కాలనీ ప్రజలతో ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని నర్సింహ హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్, కొండపురం యాదగిరి, బొల్లెపల్లి లీల, శాఖ కార్యదర్శి ఏదునూరి వెంకటేష్, సభ్యులు, గ్రామ ప్రజలు బొల్లెపల్లి స్వామి, బొల్లెపల్లి క్రాంతి, బరిగల నవీన్, బొల్లెపల్లి అంజయ్య, వెంకటస్వామి, బొల్లెపల్లి పద్మ, శారద, బుచ్చమ్మ మొగిలిపాక స్వరూప, చేగూరి అండాలు తదితరులు పాల్గొన్నారు.



## కనుమరుగైన కాంగ్రెస్ పార్టీని గట్టెక్కించిన ఏకైక నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి

కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్

**మునుగోడు జనవరి 05 (జనంసాక్షి):**
కనుమరుగై పోయిందన్న కాంగ్రెస్ పార్టీని ఒక కొలిక్కి తీసుకొచ్చిన నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి అని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ అన్నారు.మునుగోడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసింహ గౌడ్ మాట్లాడుతూ గత 2023 లో జరిగిన ఉప ఎన్నికల్లో భాగంగా మునుగోడులో కాంగ్రెస్ పార్టీ లేదని పార్టీ టికెట్ తో ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజగోపాల్ రెడ్డి ఆ పార్టీని రాష్ట్రంలో కనుమరుగు చేసేందుకు బిజెపి పార్టీ నుంచి పోటీ చేశాడనీ,ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎత్తుకొని నిస్వార్థమైన కాంగ్రెస్ నాయకులు ఏ ఒక్కరూ అధైర్య పడకుండా చలమల్ల కృష్ణారెడ్డి అండగా నిలిచి పార్టీని కాపాడాడు.అలాంటి వ్యక్తికి 2024 పార్టీ టికెట్ దక్కని కారణంగా కాస్త అసంతృప్తితో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సిద్ధమైన ఆయన బిజెపి పార్టీ నుండి పోటీ చేసి ఎన్నికల అనంతరం ఆ పార్టీకి రాజీనామా చేసి తిరిగి నాడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జి దీప్దాస్ సమక్షంలో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ గాంధీభవన్ కాంగ్రెస్ పార్టీ నేతల సమక్షంలో పార్టీలో చేరాడు.అలాంటి నాయకుడిని కాంగ్రెస్ పార్టీ కాదని అనడం అవివేకం. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకుంటున్న నాయకులంతా కూడా ఇలా ఒక ఎన్నికల సందర్భంగా బిజెపి పార్టీలోకి వెళ్లి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చినవారే.అలాగే చలమల్ల కృష్ణారెడ్డి కూడా పార్టీ మారి తిరిగి తన సొంత పార్టీ అయిన కాంగ్రెస్ లో చేరి గత ఏడాదిన్నర క్రితంగా పార్టీ అభివృద్ధికి పేద ప్రజల సమస్యల పరిష్కారం కు కృషి చేస్తున్నాడు. ఆయనని కాంగ్రెస్ పార్టీ కాదు అని అనే నైతిక హక్కు ఏ ఒక్కరికి లేదు. దానిని ప్రతి ఒక్క నాయకుడు గమనించాలి. కృష్ణారెడ్డిని పార్టీ కాదని చెప్తున్న నాయకుడే ఒకప్పుడు ఆయన వెంట ఉండి ఆ తర్వాత ఆయన స్వలాభాల కోసం సహాయ సహకారాలు కోరి ఇప్పుడు మరొక నాయకుడు మెప్పుకోసం మాట్లాడడం సరికాదన్నారు.ఇప్పటికైనా నలుగురికి సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్న కృష్ణారెడ్డి పై అసత్యపు ప్రచారం చేయడం మానుకోవాలనీ అన్నారు.ఈ కార్యక్రమంలో ఐతగోని సైదులు,శ్రీశైలం, చెన్నయ్య,శ్రీను,బలరాం, సురిగి రమేష్,బోయపల్లి శ్రీను,లింగయ్య,నరసింహ, మధు,కిరణ్ పాల్గొన్నారు.



## పెన్షనర్లకు నగదు రహిత వైద్యసేవలు అందించాలి

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంను, ఆ సంఘ సూర్యాపేట మండల యూనిట్ నూతన కమిటీ ఎన్నికను సోమవారం జిల్లా కేంద్రంలోని ఖమ్మం రోడ్డులో గల హోటల్ జయ భాస్కర ఇన్ లో నిర్వహించారు.ఆ సంఘ సూర్యాపేట మండల యూనిట్ నూతన అధ్యక్షులుగా సుదగాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, కోశాధికారిగా సుధాకర్, అసోసియేషన్ అధ్యక్షులుగా వెంకన్న, గౌరవ అధ్యక్షులుగా దేవిరెడ్డి రవీందర్ రెడ్డిని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి దండ శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు. పెండింగ్ లో ఉన్న డిఏలను వెంటనే చెల్లించాలన్నారు. పిఆర్సీని ప్రకటించాలని కోరారు.మార్చి 2024 తర్వాత రిటైర్ అయిన ఉద్యోగులకు అన్ని రిటైర్డ్ బెనిఫిట్స్ చెల్లించాలని పేర్కొన్నారు.పెన్షనర్లు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ ఎన్నికల అధికారులుగా కలీల్ అహ్మద్, రఘువీర ప్రసాద్, విద్యాసాగర్ రావు వ్యవహరించారు.ఈ సమావేశంలో సంఘ జిల్లా కోశాధికారి హమీద్ ఖాన్, ఉపాధ్యక్షురాలు ఆర్.నిర్మల, ప్రచార కార్యదర్శి గాలి శ్రీనివాస్,ఆత్మకూర్(ఎస్)మండల కార్యదర్శి ఎస్ కె.అబ్దుల్లా, తుంగతుర్తి మండల కార్యదర్శి పుల్లయ్య, సంఘ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేల ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సర్పంచ్

**రామన్నపేట, జనవరి 5 (జనంసాక్షి):**
గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ నిలబెట్టుకున్నారు. మండలంలోని కక్కిరేణి పరిధిలోని రంగమ్మగూడెం గ్రామానికి ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కళ నెరవేరింది. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో తనను గెలిపిస్తే గ్రామానికి రేషన్ డీలర్ వచ్చి ఉచిత బియ్యం ఇచ్చే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం సోమవారం రంగమ్మగూడెం గ్రామానికి రేషన్ బియ్యం తెచ్చి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇచ్చిన హామీ నెరవేర్చిన సర్పంచ్ చిల్ల మధురవేణి సురేష్ , రంగమ్మగూడెం 10వ వార్డు సభ్యులు వంగాల అవినాష్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నడిగోటి పాండు, పంచాయతీ కార్యదర్శి ఉమా శంకర్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ పిట్ట రాంరెడ్డి వార్డు సభ్యులు నడిగోటి నరేష్, ముద్రపోయిన శ్రీశైలం, బుర్ర నాగేష్, చిల్ల చంద్రశేఖర్, కన్నెబోయిన బాలకృష్ణ, మాజీ వార్డ్ మెంబర్ గునుగంటి సురేందర్ రావు, బోడ నరసింహ, వెంకన్న, కిషన్ రావు, నడిగోటి గణేష్, వేముల దయాకర్, శిగ వెంకటయ్య, సూరయ్య, ముద్రబోయిన మల్లేష్, కన్నెబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# ఈ నెల 10 నుండి నేనావత్ అభిలాష్ నాయక్ ఛాలెంజర్ ట్రోఫీ ప్రారంభం



**దేవరకొండ, జనవరి 05 (జనంసాక్షి)**
గ్రామీణ యువతను క్రీడల ద్వారా సమర్థవంతమైన నాయకత్వానికి తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో దేవరకొండ నియోజకవర్గం లో నియోజకవర్గ స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువత శారీరకంగా, మానసికంగా బలపడితేనే సమాజ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందనే దృక్పథంతో ఈ టోర్నమెంట్‌ను రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10, 11, 12 తేదీలలో దేవరకొండ పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ మైదానం (డిండి రోడ్) లో నిర్వహించనున్న ఈ పోటీలకు "నేనావత్ అభిలాష్ నాయక్ ఛాలెంజర్ ట్రోఫీ" అనే పేరును నిర్ణయించారు. ఈ టోర్నమెంట్‌లో దేవరకొండ నియోజకవర్గానికి చెందిన 8 మండలాల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి కబడ్డీ జట్లు పాల్గొననున్నాయి. యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పోరాట పటిమను పెంపొందించడంలో కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలకు ప్రత్యేక స్థానం ఉందని యువ నాయకుడు నేనావత్ అభిలాష్ నాయక్ అభిప్రాయపడ్డారు. గ్రామ స్థాయిలోనే క్రీడాకారులను గుర్తించి వారికి సరైన అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపగల క్రీడాకారులు ఎదుగుతారని ఆయన పేర్కొన్నారు. యువతను వ్యసనాలు, తప్పుదారి నుంచి దూరం చేసి క్రీడల వైపు మళ్లించడమే తన లక్ష్యమని, ప్రతి గ్రామంలో క్రీడా సంస్కృతి బలపడాలన్నదే తన విజన్ అని అభిలాష్ నాయక్ తెలిపారు. రాజకీయంతో పాటు సామాజిక బాధ్యతగా క్రీడా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పూర్తి మద్దతు తెలియజేస్తూ స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, యువ నాయకత్వం క్రీడా రంగంలో ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నట్లు తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్లు గ్రామీణ యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే అందరు క్రీడాకారులకు ప్రత్యేక డ్రెస్‌లు, అలాగే విజేత జట్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ విషయాన్ని టోర్నమెంట్ నిర్వాహకులు, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ ఏ. చంద్రయ్య మీడియాకు తెలియజేస్తూ, నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని క్రీడా రంగంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



## శ్రీవాసవి సేవాసమితి ఆధ్వర్యంలో
# భక్తిమాల పుస్తకం ఆవిష్కరణ

**సూర్యాపేట (జనంసాక్షి):**
భక్తులు నిత్యం భగవాన్ నామ స్మరణ చేసుకొనే విధంగా శ్రీ వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో భక్తిమాల పుస్తకం ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు శ్రీ వాసవి సేవాసమితి అధ్యక్ష,కార్యదర్శులు బచ్చు పురుషోత్తం, దేవరశెట్టి నాగరాజు, కోశాధికారి సోమా ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కమిటీ సభ్యులతో కలిసి పుస్తకాలను ఆవిష్కరించి భక్తులకు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం భక్తులు పూజ గదిలో చదువుకునే విధంగా ఈ పుస్తకంలో ముద్రించినట్లు తెలిపారు. గతంలో సంతోషిమాత పాటలు, బతుకమ్మ పాటలు పుస్తకాలు సైతం ముద్రించి భక్తులకు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. మున్ముందు ఎన్నో సామాజిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సభ్యులుగా చేరి సేవలు అందించవచ్చని తెలిపారు. పుస్తక ముద్రణకు సహకరించిన భక్తులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మిరియాల సుధాకర్ ,పోతుగంటి వెంకటేశ్వర్లు, కలకోటి నరసయ్య, సవరాల సత్యనారాయణ, కొత్త మల్లికార్జున్,సహాయ కార్యదర్శులు సోమ సుమన్, కుంచపర్తి రాజు, బచ్చు శ్రీనివాస్, వీరవెల్లి విజయ శంకర్, మహంకాళి ప్రణీత్, కొండ అనిల్ కుమార్, బిక్కు మల్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదవాడికి ఆర్థిక సహాయం చేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండన్న



**పెద్దవూర జనంసాక్షి**
నల్గొండ జిల్లా, నాగార్జునసాగర్ నియోజకవర్గం ,పెద్దవూర మండలం, కోమటికుంట తండా వాస్తవ్యులు రమావత్ బాలాజీ గత కొన్ని రోజులుగా మలక్ పేట యశోదా హాస్పిటల్ నందు అనారోగ్యంతో బాధపడుతు చికిత్స పొందుతున్నారు. వారు నిరుపేద కుటుంబం కావడం తండా వాసులు రవి నాయక్ మరియు రమేష్ నాయక్ ద్వారా విషయం తెలుసుకొని స్వయానా హాస్పిటల్ కి వెళ్లి వారిని పరామర్శించి ధైర్యాన్ని ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న,తమ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండన్న కి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమావత్ రవి నాయక్, రమావత్ రమేష్ నాయక్,మాజీ సర్పంచ్ బనావత్ శంకర్ నాయక్,కిరణ్ నాయక్,రమావత్ సందీప్ నాయక్,బనావత్ పవన్ నాయక్,రమావత్ తరుణ్ నాయక్ మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## కాల్వపల్లి గ్రామంలో మహిళలకు చీరల పంపిణీ సర్పంచ్ జక్కల రమణమ్మ ఎల్లయ్య

**మిర్యాలగూడ, జనవరి 5 (జనం సాక్షి):**
ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకమును గ్రామ ప్రజల కోసం చిత్తశుద్ధితో అందించి గ్రామ అభివృద్ధికి పాటు పడతానని కాల్వపల్లి గ్రామ సర్పంచ్ జక్కల రమణ ఎల్లయ్య అన్నారు. మిర్యాలగూడ మండలం కాల్వపల్లి గ్రామములో సోమవారం ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ చీరలను ఆ గ్రామ సర్పంచ్ జక్కల రమణ ఎల్లయ్య మహిళలకు చీరల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కాల్వపల్లి గ్రామం కోసం అనునిత్యం పనిచేస్తానని, ప్రభుత్వ నుండి వచ్చే ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రతి గడపకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన తక్షణ సమస్య పరిష్కారం కోసం వార్డు సభ్యుల సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి లావణ్య,ఉప సర్పంచ్ గోవిందు చిట్టెమ్మ, సీసీ మురళి,వివో ఏ చెన్నబోయిన మంజుల, మాజీ ఎంపిటిసి జట్టి లింగయ్య, చిన్నబోయిన వీరయ్య, చింతకాయల సైదులు, దుండిగల వెంకటమ్మ, తలకొప్పుల రవీందర్, నూక వంగ సైదమ్మ, అంగన్వాడి టీచర్ సైదమ్మ,సయ్యద్ జానీ, చెన్నబోయిన కోటయ్య, చెన్నబోయిన సైదులు, మేకల రాజు, మండల్ అంజయ్య, తలకొప్పుల శ్రీను, తలకొప్పుల జానయ్య నూక పంగ వెంకటయ్య,పరిక లావణ్య తదితరులు ఉన్నారు.



## హాలియాలో మున్సిపల్ ఎన్నికల డ్రాఫ్ట్ ఓటరు జాబితాలపై పార్టీలతో సమావేశం

**హాలియా, జనవరి 5 జనంసాక్షి:**
రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు హాలియా పురపాలక సంఘంలో నిర్వహించనున్న 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు?2026కు సంబంధించి డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ వారీ ఓటరు జాబితాలు, క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్ ప్రక్రియపై హాలియా పురపాలక సంఘ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అసిస్టెంట్ జిల్లా ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్, హాలియా అధ్యక్షత వహించారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ, టీడీపీ, సీపీఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాల ప్రచురణ (01.01.2026), క్లెయిమ్స్ , ఆబ్జెక్షన్స్ దాఖలు చేసే విధానం, ఓటర్ల చేర్పు, తొలగింపు, సవరణలు, వార్డు మార్పులు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. మరణించిన ఓటర్లు, డబుల్ ఓటర్ల తొలగింపు, వార్డు పరిధిలో నివసించే ఓటర్లు మాత్రమే ఆయా వార్డుల్లో ఉండేలా చర్యలు తీసుకోవడం, ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు గరిష్ఠంగా 800 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, ఓటర్ల చేర్పు, తొలగింపు, సవరణల ప్రక్రియ అంతా ఎన్నికల చట్టాలు మరియు రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ద్వారా మాత్రమే చేపడతామని స్పష్టం చేశారు. అన్ని అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం 10.01.2026న ఫైనల్ ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి తహసిల్దార్ రఘు తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ షాక్ సర్క్యూట్ తో ఫ్రిడ్జ్ దగ్ధం

- వంట గదిలో బెడ్ రూమ్లో వ్యాపించిన మంటలు
- వంట సామాగ్రి, బట్టలు టీవీతో పాటు పలు వస్తువులు పూర్తిగా దగ్ధం
- మూడు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఆర్ ఐ రంజిత్ రెడ్డి పంచ నామాలో వెల్లడి






**పెన్ పహాడ్ జనవరి 05 (జనంసాక్షి) :**
ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ సర్క్యూట్ తో గృహంలో ఉన్న ఫ్రిడ్జ్ దగ్ధమై మంటలు చెలరేగడంతో వంట గది, బెడ్ రూమ్ లో బట్టలు, వంట సామాగ్రి,టివి డబల్ కాట్ మంచం తో పాటు వివిధ వస్తువులు పూర్తిగా కాలిపై సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది ఈ సంఘటనపై సమాచారాన్ని అందుకున్న రెవిన్యూ ఇన్స్పెక్టర్ రంజిత్ రెడ్డి తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి గ్రామానికి చెందిన అందిమల్ల నాగేశ్వరి భర్త శేఖర్ నిర్మించుకున్న మూడు గదుల రేకుల గృహంలోని వంట గదిలో ఉన్న ఫ్రిడ్జ్ ద్వారా విద్యుత్ షాక్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించడంతో వంటగదిలోని ఫ్రిడ్జ్తోపాటు మిక్సీ, స్టవ్, గిన్నెలు దగ్ధం కాగా బెడ్ రూమ్ లోని బట్టలు, 50 ఇంచుల టీవీ, డబల్ కాట్ మంచం, కూలర్ పూర్తిగా దగ్ధమై మూడు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు తన పంచనామా నివేదికను తాహసిల్దార్ కు అందజేశారు. అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయడంతో హుటాహుటిన విచ్చేసిన వారు మంటలు ఆర్పారని ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.. కుటుంబాన్ని అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.